www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 1 జులై 2024 8 పేజీలు

తూర్పుగోదావరి కాకినాడ కోనసీమ

పింఛన్ల పంపిణీకి సిద్ధం

- ఉమ్మడి జిల్లాలో 7.87 లక్షల మంది లబ్ధిదారులు
- రూ.514.142 కోట్ల నగదు సిద్ధం

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం ప్రతినిధి

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ల పంపిణీకి అధికార యంత్రాగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. తొలిరోజే అందరికీ పింఛన్లు అందించేందుకు సిద్ధమయ్యారు. ప్రభుత్వం ఇప్పటికే నిధులను విడుదల చేయడంతో జూన్ 29నే పింఛను సొమ్ములను సంబంధిత సిబ్బంది డ్రా చేశారు. సొమ్ములు ఆయా సచివాలయాలకు చేర్చారు.

గత ప్రభుత్వం వృద్ధులు, వితంతువులకు రూ.3వేల చొప్పున పింఛన్లు ఇచ్చిన విషయం విదితమే. ఎన్నికల ముందు ఎన్‌డిఎ కూటమి రూ.4వేలు పింఛను ఇస్తామని ప్రకటించింది. అంతేకాకుండా ఏప్రిల్ నుంచి ఈ పథకాన్ని వర్తింపజేస్తామని స్వయాన చంద్రబాబు ప్రకటించారు. అధికారం చేపట్టడంతో దీంతో ఏప్రిల్ నుంచి జూన్ వరకూ రూ.3వేలు, జులైకి సంబంధించి రూ.4వేలు మొత్తంగా రూ.7వేలను లబ్ధిదారులకు అందించనుంది.

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 7,67,150 మంది లబ్ధిదారులను అధికారులు ఇప్పటికే గుర్తించారు. వీరి కోసం రూ.514.42 కోట్లను పింఛనుగా అందించనున్నారు. కాకినాడ జిల్లాలో 2,79,319 మంది లబ్ధిదారులకు

రూ.188.40 కోట్లు అందించనున్నారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 2,43,529 మంది లబ్ధిదారులకు రూ.160.89 కోట్లను అందించనున్నారు.

ఉదయం 5 గంటల నుంచే పంపిణీ

ఉదయం 5 గంటల నుంచే పెన్షన్ పంపిణీ ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ మేరకు శనివారమే నగదు జిల్లాకు చేరుకుంది. అధికారుల ప్రణాళికల ప్రకారం 1వ తేదీనే 100 శాతం మేర పెన్షన్లు పంపిణీ పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టారు. పెన్షన్ల పంపిణీకి గ్రామ, వార్డ్ సచివాలయ సిబ్బందితో పాటు అదనపు సిబ్బందిగా వివిధ శాఖలలోని జూనియర్ అసిస్టెంట్, తదితర సిబ్బంది సేవలు వినియోగిస్తున్నారు. దీనికి సంబంధించిన సాంకేతిక పరికరాలను 2లో..

నేడు ఉప ముఖ్యమంత్రి పవన్ పర్యటన

ప్రజాశక్తి - పిఠాపురం

రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ సోమవారం పిఠాపురం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. మూడు రోజుల పాటు ఆయన కాకినాడ జిల్లాలో వివిధ కార్యక్రమాల్లో పాల్గోనున్నారు. సోమవారం ఉదయం గొల్లప్రోలులో విల్లాస్ సత్యకృష్ణ కన్వెన్షన్ హాల్లో జరిగే పింఛన్ల పంపిణీలో పాల్గొంటారు. అనంతరం చేబ్రోలులోని ఆయన నివాసంలో జనసేన శ్రేణులతో సమీక్ష నిర్వహిస్తారు. బుధవారం ఉప్పాడ కొత్తపల్లిలో సముద్రపు కోతకు గురవుతున్న ప్రదేశాలను సందర్శిస్తారు. నియోజకవర్గంలోని వివిధ శాఖల అధికారులతో, కూటమి పార్టీల నాయకులతో భేటి అవుతారు. అదేరోజు సాయంత్రం ఉప్పాడ బస్టాండ్ సెంటర్ వద్ద వారాహి సభలో పవన్ పాల్గొని ప్రసంగిస్తారు. ఉప ముఖ్యమంత్రి హోదాలో తొలిసారిగా ఆయన జిల్లాకు రానుండంతో అధికారులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశారు.

టూరిజం అభివృద్ధికి కృషి : మంత్రి కందుల
7లో

హాస్టల్‌లో కనీస వసతుల కరువు
2లో



నిల్వల నుంచి ఇసుక తరలిస్తే చర్యలు

జిల్లా గనులు భూగర్భ శాఖ అధికారి సుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

నిల్వల నుంచి ఎవరైనా ఇసుక లోడింగ్, రవాణా చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని జిల్లా గనులు, భూగర్భ శాఖ అధికారి ఎం.సుబ్రహ్మణ్యం స్పష్టం చేశారు. వర్షాకాలం నేపథ్యంలో తూర్పుగోదావరి జిల్లాలోని ఏడు ప్రాంతాల్లో ఇసుకను నిల్వ చేశామన్నారు. ఈ ఇసుక నిల్వల నుంచి ఎవరైనా ఇసుకను రవాణా చేయడం నేరమన్నారు. ఈ విషయాన్ని స్థానిక లారీ ఓనర్స్, డ్రవర్లు గమనించాలని తెలిపారు. ఇసుకను తరలిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.

హాస్టల్‌లో కనీస వసతులు కరువు

- సిపిఎం, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు
- సాంఘిక సంక్షేమ శాఖ బాలుర హాస్టల్ సందర్శన

ప్రజాశక్తి-అమలాపురం

అమలాపురం కొంకాపల్లి నందు గల సాంఘిక సంక్షేమ శాఖ బాలుర హాస్టల్లో కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సిపిఎం, ఎస్ఎఫ్ఐ నాయకులు అన్నారు. అమలాపురం సంక్షేమ హాస్టళ్ల పర్యటనలో భాగంగా ఆదివారం కొంకాపల్లిలో సాంఘిక సంక్షేమ శాఖ బాలుర హాస్టల్‌ను సిపిఎం నాయకులు, ఎస్ఎఫ్ఐ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు హాస్టల్‌ను పరిశీలించారు. అనంతరం పలు అంశాలు పాత్రికేయులకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఏళ్ల తరబడి పాత భవనంలో కొంకాపల్లి సాంఘిక సంక్షేమ హాస్టల్ నిర్వహిస్తున్నారని అన్నారు. కనీస వసతులు ఈ హాస్టల్ నందు లేవని విద్యార్థులు వాపోయారని తెలిపారు. అలాగే హాస్టల్లో విపరీతమైన దోమలు ఉన్నాయని వాటిని నియంత్రించలేని పరిస్థితులు ఉన్నాయన్నారు. కిటికీలకు మెస్‌లు కూడా లేవని విద్యార్థులు వాపోయారని తెలిపారు. అలాగే బాత్రూమ్‌డోర్ లేదని పాత భవనం కావడంతో దీన్ని మరమ్మతులు ఇంటి యజమాని చేయడం లేదన్నారు. సౌకర్యాలు లేక హాస్టల్ విద్యార్థులు అవస్థలుపడుతున్నారన్నారు. ప్రభుత్వం తక్షణమే సొంత భవనాన్ని నిర్మించాలని సిపిఎం డిమాండ్ చేస్తోందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా కిటికీలకు మెష్‌లు ఏర్పాటు చేయాలని టాయిలెట్స్ ఇతర సౌకర్యాలు కల్పించాలని ఈ సందర్భంగా వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత ఏడాది కాలంగా పెండింగ్లో ఉన్న హాస్టల్లో నిర్వహణకు సంబంధించిన నిధులు తక్షణమే విడుదల చేయాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. గత అనేక సంవత్సరాలుగా ఈ హాస్టల్‌ని నూతన భవనం సొంత భవనాన్ని నిర్మించాలని కోరుతున్నప్పటికీ ఏళ్ల తరబడి పాత భవనంలో నిర్వహిస్తున్నారని దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారు ఈ సందర్భంగా తెలిపారు. తక్షణం ప్రభుత్వ ఉన్నతాధికారులు స్థానిక ప్రజాప్రతినిధులు ఈ సమస్య పరిష్కారం కోసం ప్రత్యేక దృష్టి పెట్టి హాస్టల్ నూతన భవన నిర్మాణానికి కృషి చేయాలన్నారు. లేని పక్షంలో విద్యార్థులతో కలిసి ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పోరాటాన్ని తీవ్రతరం చేస్తామని సందర్భంగా తెలిపారు. ఈ పర్యటనలో ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ కె.శంకర్, నాయకులు పొలమూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను అడిగి సమస్యలు తెలుసుకుంటున్న సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, ఎస్ఎఫ్ఐ నాయకులు

బాల బాలాజీ నిత్యాన్నదానానికి విరాళం

ప్రజాశక్తి -మామిడికుదురు

అప్పనపల్లి శ్రీ బాలబాలాజీ స్వామి నిత్యాన్న దాన ట్రస్ట్‌కు ఆదివారం దాత విరాళం అందజేశారు. కాకినాడ వాసులు దిగుమర్తి శ్రీనివాస్, పద్మావతి దంపతుల కుమారుడు దిగుమర్తి తత్వ షణ్ముక్ పుట్టినరోజు ప్రతి ఏటా జూన్12న అన్నదానం జరిపించేందుకురూ.35వేలు విరాళం ఇచ్చారని ఆలయ సహాయ కమిషనర్ గ్రంధిమాధవి తెలిపారు. దాతదంపతులకు స్వామివారి చిత్రపటంఅందజే శారు

ఎంఎల్ఎ ఆనందరావును సత్కరిస్తున్న ఎస్.యానాం గ్రామస్తులు

ఎంఎల్ఎ ఆనందరావుకు సత్కారం

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

ఎంఎల్ఎగా రెండోసారి ఎన్నికైన అయితాబత్తుల ఆనంద రావును ఆదివారం ఆయన స్వగ్రామమైన ఎస్.యా నాంలో గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. తమ గ్రామం నుంచి అమలాపురం ఎంఎల్ఎగా ఆనందరావు రెండోసారి ప్రాతినిధ్యం వహించడం తమకు ఎంతో గర్వకారణమని ఎస్.యానాం గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. ఆనందరావు హయాంలో తమ గ్రామం మరింత అభివృద్ధి చెందుతుందన్న ఆశాభావాన్ని వారు వ్యక్తం చేశారు. ఎంఎల్ఎగా తాను నియోజకవర్గ అభివృద్ధి తో పాటు స్వగ్రామమైన ఎస్.యానాం అభివృద్ధికి కృషి చేస్తానని ఆనందరావు అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి సభ్యుడు, రాష్ట్ర టిడిపి వాణిజ్య విభాగం ఉపాధ్యక్షులు దేశంశెట్టి లక్ష్మీనారాయణ, మాజీ సర్పంచ్ పినిశెట్టి నరసింహరావు, మాజీ ఎంపిటిసి సభ్యుడు ఉలిశెట్టి దొరబాబు, టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు లంకే భీమరాజు, దంగేటి చిట్టిబాబు, అయితాబత్తుల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలు గుర్తించండి

ప్రజాశక్తి-రాజోలు

నియోజ కవర్గ పరిధిలో అన్ని గ్రామాల్లో పేరుకు పోయిన సమస్యలు గుర్తించి తన దృష్టికి తీసుకురావాలని ఎంఎల్ఎ దేవ వరప్రసాద్ కూటమి నేతలకు సూచించారు. సోంపల్లి గ్రామంలో పలు సమస్యలను స్థానిక నాయకులు ఎంఎల్ఎ దృష్టికి తీసుకువెళ్లారు. సిసి రోడ్ల నిర్మాణం చేపట్టాలని, డ్రయినేజీలు ర్పాటు చేయాలని జనసేన నాయకులు విప్పర్తి సాయిబాబు, వైస్ ఎంపిపి పొలమూరి శ్యాంబాబు ఎంఎల్ఎకు వినతిపత్రం సమర్పించారు. ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలు నెరవేర్చేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంఎల్ఎ అన్నారు. కార్యక్రమంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీకి సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

సిబ్బందికి అందించారు. అదనపు సిబ్బందికి బయోమెట్రిక్ యంత్ర పరికరం వినియోగంపై గత వారంలోనే శిక్షణ ఇచ్చారు. పింఛన్ల పంపిణీ కోసం బ్యాంకుల నుంచి నగదు ఉపసంహరించి, నగదు చెల్లింపులు జరిగేలా మండల అభివృద్ధి అధికారులు, మున్సిపల్ కమిషనర్లకు ఆదేశాలు జారీ చేశారు.

తూర్పు గోదావరి జిల్లాలో 9,552 క్లస్టర్ వారీగా 2,44,302 మంది పెన్షన్ లబ్ధిదారులను గుర్తించారు. ఆయా క్లస్టర్ల వారీగా సిఎఫ్ఎంఎస్ గుర్తింపు కలిగిన ప్రభుత్వ ఉద్యోగులకు లబ్ధిదారులను అనుసంధానం చేశారు. ఎన్‌టిఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ కోసం 4,092 మంది సిబ్బందికి విధులు కేటాయించారు. ఇందులో 3,905 మంది సచివాలయ సిబ్బంది, 187 మంది ఇతర శాఖల సిబ్బంది ఉన్నారు. పెన్షన్ నగదు చెల్లింపులు చేసే సమయంలో ముఖ్యమంత్రి లేఖను ప్రతి ఒక్కరికీ అందజేసి, నగదు ముట్టినట్లు రసీదు తీసుకోనున్నారు. పెన్షన్ పంపిణీ చేసే వ్యక్తి ఆధార్ బేస్డ్ విధానంలో పింఛన్లు నగదు ఇంటింటికీ వెళ్లి అందచేయనున్నారు.

ఉద్యోగ విరమణ చేసిన హెడ్ కానిస్టేబుల్‌ను సన్మానించిన నగరం ఎస్ఐ

ఉద్యోగ విరమణ చేసిన వారికి సత్కారం

ప్రజాశక్తి-యంత్రాంగం

జిల్లాలో వివిధ శాఖల్లో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన వారిని ఆదివారం పలువురు ఘనంగా సత్కరించారు. వివరాలు ఇవి..

మామిడికుదురు: విధినిర్వహణలో ఉద్యోగులు బాధ్యతాయుతంగా పని చేస్తే ప్రజల్లో మంచి గుర్తింపు పొందగలుగుతారని నగరం ఎస్ఐ సురేష్ అన్నారు నగరం పోలీస్ స్టేషన్ నందు విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ పొందిన హెడ్ కానిస్టేబుల్ కుడుపూడి ఆదినారాయణమూర్తిని ఆదివారం మామిడికుదురులో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎస్ఐ సురేశ్ నగరం పోలీస్‌స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు. **ముమ్మిడివరం:** విధి నిర్వహణలో అంకిత భావంతో చేసిన సేవలే గుర్తింపునిస్తాయని పలువురు పేర్కొన్నారు. మండలంలోని గేదెల్లంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం గా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన కారి విశ్వేశ్వరరావును ఆదివారం ఘనంగా సత్కరించారు. స్థానిక పాఠశాల కమిటీ, ఉపాధ్యాయులు మరియు గ్రామస్తుల ఆధ్వర్యంలో ఉద్యోగ విరమణ చేసిన హెచ్ఎం విశ్వేశ్వరరావు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పంచాయతీ కార్యాలయం నుంచి పాఠశాల వరకు ప్రత్యేకంగా అలంకరించిన ఎడ్ల బండిలో విశ్వేశ్వరరావును కూర్చోబెట్టి పూర్వపు విద్యార్థులు బండి కాడిని లాగుతూ పాఠశాల వరకు తీసుకువచ్చి ఉపాధ్యాయునిపై ఉన్న అభిమానాన్ని గౌరవాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ విద్యార్థులకు అంకితభావంతో అందించిన సేవలను కొనియాడారు. గత సంవత్సరం జరిగిన పదో తరగతి పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించడంలో విశ్వేశ్వరరావు కృషిని అభినందించారు. ఈ కార్యక్రమంలో కోలా బాబ్జి, గుద్దటి జమ్మి, గుద్దటి వీరాస్వామి నాయుడు, విద్యా కమిటీ చైర్మన్ శ్రీనివాసరావు ఉపాధ్యాయులు విద్యార్థులు గ్రామస్తుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గేదెల్లంక జెడ్‌పి పాఠశాల్లో హెచ్‌ఎం విశ్వేశ్వరరావు ఉద్యోగ విరమణ సభ

అమలాపురంలో సంబరాలు చేసుకుంటున్న క్రికెట్ అభిమానులు

భారత్ విజయంపై సంబరాలు

ప్రజాశక్తి-అమలాపురం, రూరల్

గత నెల 29న జరిగిన టి-20 ప్రపంచకప్ ఫైనల్స్‌లో భారత్ విజేతగా నిలిచింది. దీంతో ఆదివారం క్రికెట్ అభిమానులు సంబరాలు చేసుకున్నారు. అమలాపురం గడియార స్తంభం సెంటర్లో జనసేన పార్టీ తరపున జాతీయ జెండాలను చేత పట్టి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో పి. రాజా, ఎ.బుజ్జి, నాగసుధ కొండ పాల్గొన్నారు. **అమలాపురం రూరల్ :** టి20 క్రికెట్ వరల్డ్ కప్ ఫైనల్ లో ఇండియన్ టీమ్ విజయం సాధించడం పట్ల కోనసీమ జెఏసి హర్షం వ్యక్తం చేసింది. జెఏసి కార్యాలయంలో కన్వీనర్ బండారు రామ మోహన్ రావు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో వక్తలు శుభాకాంక్షలు తెలిపారు.

వైస్ ఎంపిపి శ్రీనివాస్‌కు పరామర్శ

ఉప్పలగుప్తం : పితృవియోగంతో బాధపడుతున్న మునిపల్లి పంచాయతీ కోటు గట్టుకు చెందిన వైస్ ఎంపిపి సాధే శ్రీనివాసరావును ఆదివారం జెడ్‌పిటిసి సభ్యుడు గెడ్డం సంపదరావు, నాయకులు పరామర్శించారు. శ్రీనివాసరావు తండ్రి నారాయణమూర్తి చిత్రపటానికి సంపదరావు, సర్పంచ్‌ల సమాఖ్య మండల అధ్యక్షుడు కె.చిన్నవరాజు, మునిపల్లి సర్పంచ్ వై.రామచంద్రరావు, ఎంపిటిసిల సమాఖ్య మండల అధ్యక్షుడు పెట్టా అప్పారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గ్రామాభివృద్ధికి కృషి : ఎంఎల్ఎ బండారు

ఆత్రేయపురం : పార్టీలకతీతంగా గ్రామ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని కొత్తపేట నియోజకవర్గ ఎంఎల్ఎ బండారు సత్యానందరావు అన్నారు. ఆదివారం పులిదిండి గ్రామంలో ఆయన పర్యటించారు. శాసనసభ్యులుగా విజయం సాధించి ప్రమాణస్వీకారం అనంతరం మొదటిసారి గ్రామానికి విచ్చేసిన సందర్భంగా నాయకులు, కార్యకర్తలతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం గ్రామ నాయకులతో సమావేశమై పలు అభివృద్ధి పనుల గురించి చర్చించారు.

కళాకారుల పెన్షన్ వయోపరిమితి 50 ఏళ్లకు తగ్గించాలని వినతి

మామిడికుదురు : కళాకారుల పెన్షన్ రూ.6వేలకు పెంచి, పింఛన్ అర్హతను 50 ఏళ్లకు తగ్గించాలని కోనసీమ వృత్తి కళాకారుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు మంగం సత్యనారాయణ ప్రభుత్వానికి విన్నవించారు. స్థానిక అంబేద్కర్ కమ్యూనిటీ హాల్లో ఆదివారం జరిగిన సమావేశంలో ఆ కవి గుర్రం ధర్మోజీరావు స్మారక అవార్డు గ్రహీత మంగం సత్యనారాయణను కళాకారుల సంఘం సన్మానించింది.

పింఛన్ల పండుగను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-రామచంద్రపురం

జులై 1 నుంచి ప్రభుత్వం అందించే పింఛన్ల పండుగ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆదివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఆంధ్ర రాష్ట్రానికి చంద్రన్న పెన్షన్ల పండుగ జులై 1న మన నాయకులు, కార్యకర్తలు అందరం కలిసి కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన కోరారు. చంద్రన్న పెన్షన్ కానుకలో భాగంగా లబ్ధిదారులందరికీ చంద్రబాబు ప్రకటించిన ప్రకారం ఏప్రిల్, మే, జూన్ మూడు నెలల పెంపు పెన్షన్ నెలకు రూ.1000 చొప్పున పెంచిన పెన్షన్ మొత్తం రూ.7 వేలు అందజేస్తారని వివరించారు. పెన్షన్లు పొందుతున్న లబ్ధిదారుల్లో ఎంతమంది అయితే ఉన్నారో వాళ్ళందరికీ సచివాలయం అధికారులు, మున్సిపల్ అధికారులు సమక్షంలో చంద్రన్న పెన్షన్ కార్యక్రమం నిర్వహించి ప్రతి ఇంటికి పింఛన్ అందజేస్తారని కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొనాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.

పెన్షన్ల పంపిణీకి సహకరించాలి

ఆలమూరు: ఎంఎల్ఎ బండారు సత్యానందరావు పిలుపుమేరకు ప్రతి కార్యకర్త పింఛన్ల పంపిణీ ఒక పండగ వాతావరణం లో జరిగేలా సహకరించాలని టిడిపి మండల అధ్యక్షుడు మెర్ల గోపాలస్వామి అన్నారు. ఇందులో భాగంగా మడికిలో టిడిపి గ్రామ అధ్యక్షుడు దొండపాటి సుబ్బరాజు అధ్యక్షతన ఉమ్మడి పార్టీల నాయకులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ పెన్షన్ల పంపిణీ చేస్తున్న అధికార యంత్రాంగానికి సహాయ సహకారాలు అందించాలని తీర్మానించారు. కార్యక్రమంలో ఉమ్మడి పార్టీల నాయకులు ఈదల రమేష్, కొత్తపల్లి నగేష్, చెల్లబోయిన సింహాచలం, అడ్డాల రాజు, మామిడిశెట్టి రమణారావు, చెల్లబోయిన శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

నేడు పెంచిన పెన్షన్ల పంపిణీ

అమలాపురం రూరల్: సిఎం చంద్రబాబు ఎన్నికలకు ముందు ఇచ్చిన మాట ప్రకారం సోమవారం అమలాపురం మండలం బండారులంక గ్రామంలో పెన్షన్లు పంపిణీ జరుగుతుందని గ్రామ సర్పంచ్ పెనుమాల సునీత ఏడుకొండలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ పరిధిలో మొత్తం పెన్షన్ దారులు 2083 మంది ఉన్నారని, రూ.కోటి 34 లక్షల 46 వేలు వారికి అందజేస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు అందరూ పాల్గొనాలని ఆమె కోరారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో అత్యాధునిక వైద్యం

ప్రజాశక్తి-అయినవిల్లి

డాక్టర్ బి. మంగాదేవి

ప్రభుత్వాసుపత్రుల్లో లభ్యమవుతున్న ఆత్యాధునిక వైద్యాన్ని ప్రజలు అందిపుచ్చుకో వాలని అయినవిల్లి పిహెచ్‌సి వైద్యాధికారి బి.మంగాదేవి అన్నారు. డాక్టర్స్ డే పురస్కరించుకుని 'ప్రజాశక్తి'తో ఆమె మాట్లాడారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఎంతో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నప్పటికీ ప్రజలకు నమ్మకం లేక కార్పొరేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారన్నారు. అన్ని వర్గాల ప్రజలు ప్రభుత్వ వైద్య సేవలు పొందేందుకు ముందుకు రావాలన్నారు. సీజనల్ వ్యాధులపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సరైన పోషకాహారం తీసుకుంటే పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు.

ఘనంగా పంతం సందీప్ పుట్టిన రోజు

ప్రజాశక్తి - కరప

భారీ కేకను కట్ చేస్తున్న సందీప్

ఎంఎల్ఎ పంతం నానాజీ తనయుడు పంతం సందీప్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగింది. ఆదివారం కరపలోని చిరంజీవి కళ్యాణ మండపంలో జనసేన మండల పార్టీ అధ్యక్షుడు బండారు మురళి, నాయకులు భోగిరెడ్డి కొండబాబు, భోగిరెడ్డి గంగాధర్, రెడ్డిపల్లి భాస్కర్, ముద్రగడ రమేష్, యాళ్ల వీర వెంకట సత్యనారాయణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. రెడ్డిపల్లి భాస్కర్ ఏర్పాటుచేసిన గజమాలను క్రేన్‌తో వేసి సత్కరించి, కేక్ కట్ చేసి, శాలువా, పూలమాలలతో తమ అభిమానాన్ని చాటుకొన్నారు. అనంతరం వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. రూరల్‌లోని విద్యార్థులకు పుస్తకాలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ జనసేన పార్టీ అధ్యక్షుడు పేకేటి దుర్గాప్రసాద్, నాయకులు సైనవరపు భవాని శంకర్, పేపకాయల అంజి, కూనపురెడ్డి శ్రీను, కసిలంక సతీష్, భగవాన్,పాల్గొన్నారు.

యాత్రికులతో గౌరవంగా మెలగాలి

ప్రజాశక్తి - పిఠాపురం

పాదగయ క్షేత్రానికి విచ్చేసే భక్తులతో గౌరవంగా మెలగాలని అసిస్టెంట్ కమిషనర్, పాదగయ ఇఒ అల్లు వెంకటదుర్గాభవాని ఆదేశించారు. కుక్కుటేశ్వర స్వామి దేవస్థానం సహాయ కమిషనర్, ఇఒగా విధులు నిర్వస్తున్న పి.నారాయణమూర్తి ఆదివారం పదవీ విరమణ చేయడంతో ఆయన స్థానంలో రాజమహేంద్రవరం సహాయ కమిషనర్, ఆభరణాల తనిఖీ అధికారిణి దుర్గభవాని పాదగయ ఇఒగా అదనపు బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆమె పాదగయ క్షేత్రాన్ని పరిశీలించారు. మరుగుదొడ్ల నిర్వహణ, పుష్కరిణి, తాగునీరుపై ప్రత్యేక శ్రద్ధ వహించి యుద్ద ప్రాతి

బాధ్యతలు స్వీకరిస్తున్న ఇఒ

పదికన సౌకర్యాలు మెరుగుపరచాలని ఆదేశించారు. దేవస్థానంలోని ఎలక్ట్రికల్ వైరింగ్, ప్లంబింగ్, పిండ ప్రధానాలు చేసుకునే ప్రదేశాలు కేటాయింపులపై దేవాదాయ శాఖ ఇంజనీరింగ్ అధికారులకు ప్రతిపాదనలు పంపాలన్నారు. సిబ్బంది తప్పనిసరిగా యూనిఫామ్ ధరించాలని, విధుల్లో అలసత్వంవహిస్తే ఉపేక్షించేది లేదన్నారు.

క్రైం వార్తలు

పిల్లలు పుట్టడం లేదని వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి - ఉంగ్రాజవరం

తనకు పిల్లలు పుట్టడం లేదని మనస్తాపం చెందిన వివాహిత కాలువ లోకి దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. మోర్త గ్రామానికి చెందిన వివాహిత తోట రాశి (24)కి 2020లో ఉంగ్రాజవరానికి చెందిన దుర్గారావుతో వివాహం అయ్యింది. వివాహమై నాలుగేళ్లు గడుస్తున్నా పిల్లలు పుట్టరని తెలిసి మనస్తాపం చెందింది. శనివారం దమ్మెన్ను కొండాలమ్మ గుడి వద్ద, కాలువలో దూకింది. ఆమె మృతదేహం ఆదివారం లభ్యమయింది. రాశి తల్లి తోట మంగ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

అదనపు కట్నం వేధింపులపై కేసు నమోదు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

అదనపు కట్నం తేవాలంటూ భర్త, అత్తమామలు వేధిస్తున్నారంటూ మహిళ ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి..మండలంలోని ర్యాలీ గ్రామానికి చెందిన వాసంశెట్టి మీనాక్షికి కాకినాడ సర్పవరానికి చెందిన వాసంశెట్టి శ్రీనివాసుతో 2023 ఫిబ్రవరి నెలలో పెద్దల సమక్షంలో వివాహం జరిగింది. ఈ సమయంలో రూ.మూడు లక్షల కట్నం మరియు బంగారం, వెండి లాంఛనాలు ఇచ్చి అత్తవారింటికి పంపించారు. ఇటీవల కాలంలో భర్త శ్రీనివాస్, అత్తమామలు అదనపు కట్నం తేవాలంటూ తనను వేధిస్తున్నారని మీనాక్షి ఆదివారం పోలీసులను ఆశ్రయించింది. దీనిపై బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎస్.శ్రీనివాసు తెలిపారు.

కిడ్నీ వ్యాధి బాధితునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - తాళ్లరేవు

బాధితునికి నగదును అందిస్తున్న గ్రామస్తులు

మండలానికి చెందిన కోరంగి పంచాయతీ పాతకోరంగి గ్రామానికి చెందిన పలివెల రాజు రెండు కిడ్నీలు పాడై పోయాయి. కిడ్నీ మార్పిడి చేయాలని వైద్యులు సూచించారు. దీంతో గ్రామస్తులంతా ఏకమై బాధితుడు వైద్య ఖర్చుల కోసం రూ.1.46 లక్షల మొత్తాన్ని సేకరించారు. ఆ మొత్తాన్ని ఆదివారం ఆ కుటుంబానికి అందజేశారు. గ్రామస్తుల సహకారానికి ఆ కుటుంబం కృతజ్ఞతలు తెలిపింది. వైద్య ఖర్చులకు అవసరమైన సహకారాన్ని అందించేందుకు దాతలు ముందుకు రావాలని గ్రామస్తులు కోరారు.

పరీక్షకు వెళ్లిన ఇద్దరు నిరుద్యోగులకు నిరాశ

కేంద్రం గేటు వద్ద నిలుచున్న అభ్యర్థులు,(ఇన్‌సెట్‌లో గేటు వద్ద కన్నీరు పెడుతున్న అభ్యర్థి)

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరిలో హోంగార్డు పరీక్షకు యానాం నుంచి వెళ్లిన ఇద్దరు నిరుద్యోగులకు నిరాస ఎదురైంది. పరీక్షా కేంద్రానికి రెండు నిమిషాలు ఆలస్యం కావడంతో అనుమతి నిరాకరించారు. దీంతో వారు పరీక్షా కేంద్రం గేటు వద్ద కన్నీరు పెట్టుకోవడంతో ఆ వీడియో వైరల్‌గా మారింది. యానాం ప్రాంతంలోని మెట్టకురు చెందిన ఉండ్రు వైష్టవ్, జి.అఖిల్ పుదుచ్చేరి వెళ్లారు. అయితే పుదుచ్చేరిలోని ముత్యాలపేటలో ఉన్న పరీక్ష కేంద్రం అడ్రసు తెలుసుకుని పరీక్షా కేంద్రానికి ఆదివారం చేరకున్నారు. అయితే అప్పటికే సమయం అయిపోవడంతో వారిని గేటు ముందు నిలిపివేశారు. దీంతో వారు ఆ గేటు వద్ద కన్నీరు మున్నీరు అయ్యారు. అడ్రస్ తెలుసుకుని వెళ్లే సరికి కేవలం రెండు నిమిషాలు మాత్రమే ఆలస్యం అయిందని, అయినా తమను పరీక్షకు అనుమతించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత కొన్ని నెలలుగా శిక్షణ పొందామని అన్నారు.

ఇఒపిఆర్‌డి సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండల ఇఒపిఆర్‌డి కాగితాల రాజశేఖర్ చేసిన సేవలు అభినందనీయమని ఎంపిడిఒ జి.ఉషారాణి అన్నారు. ఆదివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇఒపిఆర్‌డి రాజశేఖర్ ఉద్యోగ విరమణ అభినందన సభ మండల పరిషత్ కార్యాలయ పరిపాలన అధికారి సత్యనారాయణమూర్తి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల పరిధిలోని 23 గ్రామ పంచాయతీల కార్యదర్శుల సమన్వయంతో బాధ్యతలు నిర్వహించి అందరి మన్ననలు పొందారన్నారు. పంచాయతీల కార్యదర్శులు రమణ, జ్యోతుల పద్మరాజు, సత్యనారాయణమూర్తి, భారతి మాట్లాడుతూ విధుల నిర్వహణలో ఆయన అందించిన ప్రోత్సాహం, సహాయ సహకారాలు మరువ లేనివన్నారు. కమ్యూనిస్టు కుటుంబంలో పుట్టిన ఆయన పత్రికా రంగంలో వివిధ సేవలు అందించడంతోపాటు కవిగా, రచయితగా ఎంతో గుర్తింపు పొందారన్నారు. అనంతరం రాజశేఖర్, నిర్మల దంపతులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో హాసింగ్ ఎఇ సురేష్, పంచాయతీల కార్యదర్శులు సుభాని, ఈశ్వరరావు, భార్గవ, వి శ్రీనివాస రావు, నిర్మల, శ్రీదేవి, కళ, త్సలికి దొరబాబు, రాధాకృష్ణ, శాంతివర్ధన వికలాంగుల పాఠశాల డైరెక్టర్ రాయవరపు వీరబాబు పాల్గొన్నారు.

మడ అడవులను సందర్శించిన ట్రైనీ ఐఎఎస్‌లు

ప్రజాశక్తి - తాళ్లరేవు

పర్యావరణ పరిరక్షణ, సామాజిక బాధ్యతలో భాగంగా ఐదుగురు ట్రైనీ ఐఎఎస్‌లు కోరంగి మడ అడవులను సందర్శించారు. ఈ సందర్భంగా అటవీ శాఖ అధికారులు చొల్లంగి పర్యావరణ కేంద్రంలో మడ అడవుల ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో శిక్షణ పొందుతున్న 2023 బ్యాచ్ ఐఎఎస్‌లు సిహెచ్.కళ్యాణి, డి.హిమవంశి, పి.స్వప్నిల్ జగన్నాథ్, బి.వినూత్న, హెచ్ఎస్.భావన, శుభం నో క్వాల్ తదితరులు ఉన్నారు.

ఆహార సలహా సంఘాల ఏర్పాటు అవసరం

ప్రజాశక్తి - కాకినాడ

పౌర సరఫరాల నిర్వహణలో మేలైన ప్రయోజనాలు ఏర్పడేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం ఆహార సలహా సంఘాలను ఏర్పాటు చేయాలని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు కోరారు. దిగువ కేంద్రాల పంపిణీ నుంచి మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి వరకు కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. అన్ని రాజకీయ పార్టీలు, వినియోగదారుల సంఘాలు, వాణిజ్య సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు స్థానిక ప్రభుత్వాల సభ్యులతో ఆహార కమిటీలు ఏర్పాటు చేయడం వలన ప్రతి మూడు నెలలకు వాస్తవిక గ్రౌండ్ రిపోర్ట్ మేరకు ప్రభుత్వం ప్రజాహిత చర్యలు నిర్వహించే అవకాశం ఉంటుందన్నారు.

ముమ్మరంగా వ్యవసాయ పనులు

ప్రజాశక్తి-రామచంద్రపురం

కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు రైతులు తొలకరి పంట పనులు ముమ్మరం చేశారు. కొందరు రైతులు ఆకుముడులను సిద్ధం చేశారు.పలు గ్రామాల్లో ఆకుమడులు ఏపుగా పెరుగుతున్నాయి. కొన్ని గ్రామాల్లో పంట దమ్ములు కూడా పూర్తి అయ్యాయి. నియోజకవర్గంలో గల రూరల్ మండలంలో 17వేల ఎకరాలు పంట సాగు అవుతుండగా, కె. గంగవరం మండలంలో 15 వేల ఎకరాల్లో వరి పంటసాగు అవుతోంది . తొలకరికి అధిక శాతం రైతులు స్వర్ణ రకం ఎంటియు 7029 రకం పండించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ వారంలో వర్షాలు మరింతగా కురిస్తే తొలకరి సేద్యం మరింత వేగంగా ఊపందుకుంటుంది. అవసరమైన విత్తనాలు చాలా వరకు రైతులు సిద్ధం చేసుకున్నారు. పంటదమ్ములు కూడా పలు చోట్ల పూర్తి కావడం తో ఈ వారంలో తొలకరి నాట్లు పడే అవకాశం ఉంది. తొలకరి పంట వర్షాలపై ఆధారపడి ఉంటుంది.

ఏపుగా పెరిగిన ఆకుమడి

కొత్త చట్టాలపై అవగాహన అవసరం : ఎస్‌పి శ్రీధర్

ప్రజాశక్తి-అమలాపురం

దేశవ్యాప్తముగా జూలై 1వ తేదీ సోమవారం నుండి అమలులోకి రానున్న కొత్త చట్టాలు పై పోలీస్ అధికారులకు అవగాహన అవసరమని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్‌పి ఎస్.శ్రీధర్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన అధ్యక్షతన జిల్లా పోలీస్ అధికారులతో ఆదివారం పలు అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పెండింగ్ అట్రాసిటి కేసులు, మహిళలపై నేరాలకు సంబంధించిన కేసులు, గ్రేవ్ కేసులు, నాన్ గ్రేవ్ కేసులు, మిస్సింగ్ కేసు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించి కేసుల సత్వర పరిష్కారం, సమగ్ర విచారణ కొరకు సంబంధిత దర్యాప్తు అధికారులకు ఎస్‌పి సూచనలు జారీ చేశారు.సాధారణ ఎన్నికలకు సంభందించిన ఫారం-7 కేసులు అనగా ఓట్లు గల్లంతు అయిన కేసులు, ఎన్నికల సంభందించిన కేసుల స్థితిపై ఆరా తీసి ఆ కేసుల సత్వర పరిష్కారం చేయాలని ఆదేశించారు.సైబర్ నేరాలు, ఆన్ లైన్ ఫ్రాడ్స్ పై ప్రతి పోలీసు అధికారి అవగాహన కలిగి ఉండాలని, లోన్ యాప్ మోసాలపై ప్రజలకు అవగాహన, వాటిపై ప్రచారం కొనసాగించాలి, నమోదైన కేసులలో

మాట్లాడుతున్న అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్‌పి ఎస్. శ్రీధర్

రికవరీ జరిగేలా ఎస్ఒపి ప్రకారం దర్యాప్తు జరగాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా రాత్రి గస్తీ పెంచి, ఆస్తి నేరాలు జరిగే ప్రాంతాలపై నిఘా పెంచి దొంగతనాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నమోదైన కేసుల్లో చోరీ సొత్తు రికవరీ పెంచి ఈ-బీట్స్ విధానాన్ని వెంటనే అమలు చేయాని, జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగాలని అధికార్లను ఆదేశించారు .ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణముగా ముంపు ప్రాంతాల్లోని పోలీస్ అధికారులు అన్ని వేళలా విధులకు హాజరుగా ఉంటూ ప్రజలకు ఎటువంటి ఇబ్బంది, ప్రాణాపాయం సంభవించకుండా విధులు నిర్వహించాలని

పాల్గొన్న పోలీసు అధికారులు

ఎస్‌పి అన్నారు. రామచంద్రాపురం అసిస్టెంట్ సెషన్స్ కోర్ట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రకాష్ రావు మాట్లాడుతూ కొత్త చట్టాలు 1. భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్బిఎంఎస్), 2. భారతీయ నాగరిక సురక్ష సంహిత (బిఎన్ఎస్ఎస్) 3. భారతీయ సాక్ష్యా అధినీయం చట్టాలపై విసిదీకరిస్తూ పోలీస్ సిబ్బంది అందరికీ విడియో కాన్ఫరెన్స్ ద్వారా చట్టాలపై అవగాహన కల్పించారు. కొత్త చట్టాలపై అవగాహన కల్పించారు చేశారు. సమావేశంలో అదనపు ఎస్‌పి ఎస్. ఖాదర్ బాషా, అమలాపురం, కొత్తపేట, రామచంద్రాపురం డిఎస్‌పిలు, జిల్లా పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ దంపతులను అభినందిస్తున్న ఎంఎల్‌సి సత్యప్రభ

ఉపాధ్యాయ వృత్తి విలువైనది: ఎంఎల్‌సి

ప్రజాశక్తి - ఏలేశ్వరం

సమాజంలో ఉపాధ్యాయ వృత్తి విలువైనదని ఎంఎల్‌సి వరుపుల సత్యప్రభ అన్నారు. ఆదివారం 41 ఏళ్ళ ఉపాధ్యాయునిగా, హెచ్‌ఎంగా, ఎంఇఒగా సేవలందించిన పల్లా వెంకటేశ్వరరావు పదవీ విరమణ సందర్భంగా సత్కార కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదవీ విరమణ అనంతరం కూడా సమాజ సేవలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన ప్రతిపాడు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ వరుపుల తమ్మయ్య బాబు, ఎంపిపి గొల్లపల్లి బుజ్జి, కౌన్సిలర్ బొడ్డిరెడ్డి గోపాలకృష్ణ, విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఉద్దగిరి సోమరాజు, పెంటకోట మోహన్ తదితరులు పాల్గొన్నారు.

సూర్యనారాయణ సేవలు ఆదర్శనీయం

ప్రజాశక్తి - తాళ్లరేవు

తాళ్లరేవు ఇరిగేషన్ సెక్షన్‌లో డెల్టా లష్కర్‌గా సుమారు 18 సంవత్సరాలు విధులు నిర్వహించిన సూర్యనారాయణ సేవలు ఆదర్శనీయమని తాళ్లరేవు ఇరిగేషన్ ఎఇఇ ఈశ్వర్, పోలేకుర్రు నీటి సంఘం మాజీ అధ్యక్షుడు అల్లూరి రామకృష్ణంరాజు అన్నారు. ఆదివారం లయన్స్ క్లబ్ హాలులో సూర్యనారాయణ పదవీ విరమణ సత్కారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శివారు భూములకు సాగునీరు అందించడంలో సూర్యనారాయణ సేవలు మరింత అవసరమని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ, తులసమ్మ దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ వెంకటేశ్వరరావు, ఇరిగేషన్ సిబ్బంది సత్యనారాయణ, పి.బి.రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌ఛార్జ్ ఎంపిడిఒగా నాగేశ్వర శర్మ

ప్రజాశక్తి - కాజులూరు

ఇన్‌ఛార్జ్ ఎంపిడిఒగా సి.నాగేశ్వరశర్మ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఎంపిడిఒగా పనిచేసిన రత్నరాజ్ పదవి విరమణ చేయడంతో మండల పరిషత్ కార్యాలయ నిర్వహణాధికారిగా ఉన్న నాగేశ్వరశర్మను ప్రభుత్వం ఇన్‌ఛార్జ్ ఎంపిడిఒగా నియమించడంతో ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తానని అన్నారు. ఈ సందర్భంగా ఆయనను కార్యాలయ అధికారులు రంగనాయకులు, మైథిలి, సిబ్బంది అభినందనలు తెలిపారు.

నేడు 3 గంటలు మరిడమ్మ దర్శనం నిలుపుదల

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మరిడమ్మ దర్శనంను సోమవారం సుమారు 3 గంటలపాటు నిలిపివేస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి, ఎసి సి హెచ్.రామమోహనరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మరిడమ్మ జన్మ నక్షత్రం సందర్భంగా సోమవారం పంచామృత అభిషేకం, విశేష పూజలు, పూర్ణాహుతి కార్యక్రమాలను వైభవంగా నిర్వహిస్తున్నామని, అందుకే ఉదయం 11:30 గంటల నుంచి 2:30 గంటల వరకు మరిడమ్మ దర్శనంను నిలిపివేయడం జరుగుతుందని, భక్తులు గమనించాలని విజ్ఞప్తి చేశారు.

ఎన్‌హెచ్‌ఆర్ జిల్లా ఉపాధ్యక్షునిగా శర్మ

ప్రజాశక్తి - ఏలేశ్వరం

నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ కాకినాడ జిల్లా ఉపాధ్యక్షుడిగా ఏలేశ్వరంకు చెందిన మాసర నాగ మృత్యుంజయ శర్మ నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు నూతలపాటి అప్పలకొండ నుంచి నియామక ఉత్తర్వులు అందాయి. ఈ సందర్భంగా శర్మ మాట్లాడుతూ సమాజంలో పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన ప్రజలకు న్యాయం చేసేందుకు కృషి చేస్తానని అన్నారు.

నేడు హుండీల లెక్కింపు

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలానికి చెందిన తిరుపతి గ్రామంలోని శృంగార వల్లభ స్వామి ఆలయ హుండీల ఆదాయాన్ని ఈనెల 1వ తేదీన లెక్కింపు జరుపుతారని ఆలయ కార్య నిర్వహణాధికారి వడ్డి శ్రీనివాసరావు తెలిపారు.

పిఠాపురానికి నేడు పవన్ కళ్యాణ్ రాక

-తీర ప్రాంతాన్ని పరిశీలించిన కలెక్టర్

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పిఠాపురం నియోజకవర్గ ఎంఎల్‌ఎ పవన్ కళ్యాణ్ మూడు రోజుల పర్యటన నిమిత్తం సోమవారం పిఠాపురానికి రానున్నారు. ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయిలో జరుగుతున్న ఏర్పాట్లను ఆదివారం కలెక్టర్ షాన్ మోహన్, వివిధ శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. ఉప్పాడ తీర ప్రాంతం కోతకు గురవుతున్న ప్రదేశాలను సందర్శించారు. సూరాడపేట గ్రామంలో ప్రజలతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గొల్లప్రోలు హైవే పక్కన ఏర్పాటు చేసిన హెలిప్యాడ్, సభా ప్రాంతాన్ని పరిశీలించి, అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పిఠాపురం ఎంఎల్‌ఎగా ఎన్నికైన పవన్ కళ్యాణ్ డిప్యూటీ సీఎం హోదాలో జరుగుతున్న తొలి పర్యటన నేపథ్యంలో అధికారులు పూర్తి అప్రమత్తత అయ్యారు. పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రణాళిక ప్రకారం పని చేయాలన్నారు. సభా వేదిక వద్ద ఎటువంటి తోపులాట జరగకుండా సజావుగా జరిగేందుకు అధికారులు ప్రతిష్టమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ పర్యటనలో డిఆర్‌డిఎ పీడీ కె.శ్రీరమణి, ఆర్ అండ్ బి ఎస్ఇ శ్రాంత, జిల్లా మత్స్య శాఖ అధికారి కరుణాకర్, ఆర్‌డిఒ ఇట్ల కిషోర్, ఎంపిడిఒ నారాయణరావు, తహశీల్దార్ ఎం.సుందర్‌రాజు, జనసేన నాయకులు జ్యోతుల శ్రీనివాస్, సాన నాగు, చింతలపూడి వెంకటరమణ పాల్గొన్నారు.

మంత్రి పర్యటనా ఏర్పాట్లపై ఆరా తీస్తున్న కలెక్టర్

డ్రాయింగ్ పోటీలను ప్రారంభిస్తున్న రాజేష్‌కుమార్ దేవత

విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు

ప్రజాశక్తి - పెద్దాపురం

ఈ నెల 4న జరిగే అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా పెద్దాపురం చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో విద్యార్థులకు అల్లూరి జీవితంపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఆదివారం ఈ పోటీలను మిషన్ అన్నపూర్ణ సహాయనిధి వ్యవస్థాపకులు రాజేష్ కుమార్ దేవత ప్రారంభించారు. పిసిసి అధ్యక్ష, కార్యదర్శులు కూనిరెడ్డి అరుణ, రొంగల అరుణ్‌కుమార్ మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు జీవిత విశేషాలకు సంబంధించి విద్యార్థులకు వారు చదువుతున్న పాఠశాలల్లో వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. 4వ తేదీన యాసలపు సూర్యారావు భవనంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టిస్ట్ గూనూరు వెంకటరమణ, దుంగల శ్యాంకుమార్‌స్వామి, తాటిగడప సుబ్బారావు, పిసిసి గౌరవాధ్యక్షులు బుద్ధా శ్రీనివాసరావు, మణికంఠ, పూజితాసూర్యశ్రీ, సాయి, కూనిరెడ్డి పవన్ పాల్గొన్నారు.

నేటి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం రద్దు

ప్రజాశక్తి - కాకినాడ

జిల్లాలో సోమవారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పిఠాపురం పర్యటనతోపాటు, జిల్లావ్యాప్తంగా పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఉన్నందున కలెక్టరేట్‌లో జరిగే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ షాన్‌మోహన్ ఓ ప్రకటనలో తెలిపారు. కావున అర్జీదారులు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.

పింఛన్ల పంపిణీపై ప్రత్యేక దృష్టి : జెసి

ప్రజాశక్తి - కాకినాడ

జిల్లాలో జూలై 1న ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ పంపిణీ ప్రక్రియపై అధికారులంతా ప్రత్యేక దృష్టి సారించాలని జెసి ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి ఆదేశించారు. ఆదివారం కలెక్టరేట్‌లో పింఛన్ల పంపిణీ ప్రక్రియకు అనుసరించాల్సిన విధా నాలపై డిఆర్‌డిఎ, మెప్మా అధికారులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ జిల్లాలో వివిధ రకాల పింఛన్ల కింద 2,79,319 మందికి రూ.188.40 కోట్లను పంపిణీ చేయనున్నట్లు తెలి పారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించి నెలకు రూ.వెయ్యి చొప్పున మూడు నెలలకు రూ.3 వేలు, నూతనంగా పెంచిన పింఛన్ సొమ్ము రూ.4 వేలు కలిపి మొత్తం మొత్తం రూ.7వేలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులే పింఛన్ దారులకు ఇంటి వద్దే అందచేస్తారని తెలిపారు. ఈ సమావేశంలో డిఆర్‌డిఎ పీడీ కె.శ్రీరమణి, డిఎల్‌డిఒ పి.నారాయణమూర్తి, విజలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అధికారులతో సమీక్షిస్తున్న జాయింట్ కలెక్టర్

ప్రయోగాల ద్వారా అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక సైన్స్ సెంటర్‌లో సెంటర్ నిర్వాహకులు బుద్ధా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆదివారం 10వ తరగతి విద్యార్థులకు భౌతిక శాస్త్రంలో రసాయన సమీకరణాల రకాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పిం చారు. పాఠ్యాంశాలలో ఉన్న రసాయన సంయోగం, రసాయన వియోగం, రసాయన స్థానభ్రంశం, రసాయన ద్వంద్వ స్థానభ్రంశం, ఆక్సీకరణం, రెడక్షన్, తటస్తీకరణం వంటి ప్రయోగాలు విద్యార్థులతో చేయించారు. ఈ వర్క్ షాప్‌లో పెద్దాపురం, సామర్లకోట పట్టణాలలోని వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారని నిర్వాహకులు శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో చిల్డ్రన్స్ క్లబ్ అధ్యక్షులు అరుణ, ప్రధాన కార్యదర్శి అరుణ్‌కుమార్, రొంగల పూజితాసూర్య శ్రీ,సాయి, నేహ, మనోజ్, బంగారం తదితరులు పాల్గొని సహాయ సహకారాలు అందించారు.

విద్యార్థులతో ప్రయోగాలు చేయిస్తున్న శ్రీనివాస్

మనోజ్‌కుమార్‌రెడ్డికి డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల కంట్రోలర్ ఆఫ్ ఎక్జామినేషన్స్‌లో పనిచేస్తున్న కె.మనోజ్‌కుమార్‌రెడ్డి డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ అందుకున్నారు. డాక్టర్ ఎ. కైలాసరావు మార్గనిర్దేశంలో డాక్టర్ ఆర్.శ్రీనివాసరావు సహకారంతో 'ఆప్టిమల్ అలోకేషన్ ఆఫ్ యూనిఫైడ్ పవర్ ఫ్లో కంట్రోలర్ ఇన్ లార్జ్‌స్కేల్ పవర్ ట్రాన్స్‌మిషన్ నెట్ వర్క్స్ టు మినిమైజ్ కాస్ట్ అండ్ పవర్ లాస్' అనే అంశంపై పరిశోధించి సమర్పించిన థీసిస్‌కు కాకినాడ జెఎన్‌టియుకె డాక్టరేట్ డిగ్రీ ప్రకటించిందని ఆదిత్య విద్యాసంస్థల వైస్ ఛైర్మన్ డాక్టర్ ఎన్.సతీష్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ కె.మనోజ్‌కుమార్‌రెడ్డికి ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి, వైస్ ఛైర్మన్ డాక్టర్ ఎన్. సతీష్‌రెడ్డి, కళాశాల డిప్యూటీ ప్రో చాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.రమేష్, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

సుదర్శన్ కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - కాజులూరు

జర్నలిస్ట్ సుదర్శన్ కుటుంబానికి జనసేన నాయకులు, లయన్స్ క్లబ్ సభ్యులు ఆర్థిక సాయాన్ని అందించారు. ఆదివారం జనసేన పార్టీ రామచంద్రపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్, లయన్స్ క్లబ్ ఇంటర్ నేషనల్ అధ్యక్షులు, ప్రముఖ వైద్యులు చప్పిడి వెంకటేశ్వర్రావు, గొల్లపాలెం లీలాకళ్యాణి సాధన లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు సలాది పుష్పావతి, బొండా వెంకన్న రూ.5 వేలు చొప్పున మొత్తం రూ.20 వేలను సుదర్శన్ కుటుంబానికి అందచేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ గవర్నర్ వనుం శ్రీనివాసరావు, మాజీ గవర్నర్ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సుదర్శన్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న నాయకులు

కొత్త న్యాయ చట్టాల అమలు ఆపాలి

ప్రజాశక్తి - ఏలేశ్వరం

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన న్యాయ చట్టాల అమలును నిలుపుదల చేయాలని ప్రత్తిపాడు కోర్ట్ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు బొగతా శివ డిమాండ్ చేశారు. ఆదివారం ప్రత్తిపాడులో ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ రౌండ్ టేబుల్ సమావేశం అనంతరం కొత్త న్యాయ చట్టాలపై ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శివ మాట్లాడుతూ కొత్త చట్టాలలోని పలు నిబంధనలు రాజ్యాంగబద్ధతపై అనుమానాలు వ్యక్తమవుతున్న దృష్ట్యా వాటిపై పూర్తి అవగాహన కల్పించే వరకు చట్టాలు అమలు నిలుపుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు అవసరాల దేవి, పిల్లా రాజు, బండారు నరసింహ రావు, బత్తిన సింహాచలం, కంద నానాజీ, పాల్గొన్నారు.

ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

రామాలయానికి స్టీల్ గ్రిల్స్ బహూకరణ

ప్రజాశక్తి - తాళ్లరేవు

స్థానిక గాంధీనగర్‌లోని కోదండ రామాలయంకు రవి జూనియర్, డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ రవికుమార్ రూ.70 వేల విలువ చేసే స్టీల్ గ్రిల్స్‌ను బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామాలయం రక్షణకు అవసరమైన స్టీల్ గ్రిల్‌ను అందించడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా గాంధీనగరం పెద్దలు, గణేష్ యూత్ యువకులు రవికుమార్‌ను పూలమాలలు వేసి శాలువాతో ఘనంగా సత్కరించారు.

టూరిజం అభివృద్ధికి కృషి

పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి దుర్గేష్

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కందుల దుర్గేష్

ప్రజాశక్తి - నిడదవోలు

జిల్లాలో పర్యాటక రంగం అభివృద్ధికి చాలా అవకాశాలు ఉన్నాయని ఆ దిశగా పర్యాటక రంగ అభివృద్ధికి కృషి చేస్తామని పర్యాటక సాంస్కృతిక సినిమా ఆటోగ్రాఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. ఆదివారం నిడదవోలు పట్టణం యర్నగూడెం రోడ్డులోని ఆనంద్ ఇన్ హోటల్‌లో పాత్రికేయుల సమావేశంలో మంత్రి దుర్గేష్ మాట్లాడారు. రాష్ట్రంలో దేశంలో టూరిజం అభివృద్ధి చెందిన పరిస్థితులను అవగాహన చేసుకుని మన ప్రాంతంలో ఆ దిశగా టూరిజాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. జిల్లాలో ఈ మధ్యనే పాపికొండల విహారయాత్ర ప్రారంభమైందని పర్యాటకులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సేఫ్టీ మెజర్ ఉండే విధంగా చర్యలు చేపడతామన్నారు. పాపికొండలు ప్రాంతాన్ని పరిశీలించేందుకు వెళుతున్నట్లు మంత్రి స్పష్టం చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు జులై 1వ తేదీన ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ లబ్దిదారులకు ఇంటి వద్దనే అందించేందుకు ఏర్పాట్లు చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు జులై ఒకటవ తేదీన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ లబ్దిదారులకు ఏప్రిల్, మే, జూన్ మాసాలకు రూ.3 వేలు కలుపుకుని జులై మాసంలో అందించే రూ.4 వేలతో మొత్తం రూ.7 వేలను లబ్దిదారులకు జులై 1వ తేదీ ఉదయం 5 గంటల నుంచే లబ్దిదారుల ఇంటి వద్దనే అందిస్తామన్నారు. పెంచిన పెన్షన్లతో ప్రభుత్వంపై ఆర్థిక భారం పడినప్పటికీ ప్రజా సంక్షేమమే లక్ష్యం అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్‌టిఆర్ జిల్లాలో పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారని, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ పిఠాపురం నియోజకవర్గం గొల్లప్రోలులో పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. తాను నిడదవోలు నియోజకవర్గం గోపవరంలో పెన్షన్ పంపిణీ కార్యక్రమానికి హాజరు అవుతానని తెలిపారు.

రాష్ట్ర ఆర్థిక పరమైన అంశాల్లో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఇప్పటికే పోలవరం అంశానికి సంబంధించి శ్వేత పత్రాన్ని విడుదల చేశారని మంత్రి దుర్గేష్ తెలిపారు. గత ప్రభుత్వం ఎన్నికల ముందే రైతులకు ఆర్థిక సహాయాన్ని అందజేయలేదని తెలిపారు. రైతు సంక్షేమాన్ని కాంక్షించే ఈ ప్రభుత్వం త్వరలో రైతులకు ఆర్థిక సహాయాన్ని అందజేస్తామని తెలిపారు. ఇప్పటికే ఈ అంశంపై క్యాబినెట్‌లో చర్చించామన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం, స్పష్టమైన అవగాహన లేకపోవడంతో పోలవరం ప్రాజెక్టు అభివృద్ధికి నోచుకోలేదని మంత్రి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టిన వెంటనే యుద్ధ ప్రాతిపదికన పోలవరం ప్రాజెక్టును పరిశీలించారు. ఎక్కడ లోపాలు ఉన్నాయో గుర్తించి ప్రాజెక్ట్ పనులు వేగవంతం చేసేందుకు అంతర్జాతీయ సాంకేతిక నిపుణుల బృందం పరిశీలించేందుకు ఏర్పాట్లు చేస్తోందన్నారు. 2029 నాటికి పోలవరం ప్రాజెక్టు పనులు పూర్తయ్యే విధంగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు.

నిడదవోలులోని సామాజిక ఆసుపత్రిని ప్రస్తుతం ఉన్న 30 పడకల నుంచి 100 పడకలు చేసేందుకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ఈ మేరకు వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శితో సంప్రదించామన్నారు. గోదావరి జలాల ద్వారా నిడదవోలు పట్టణానికి తాగునీటి సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామన్నారు. నియోజకవర్గంలో రహదారులు, డ్రైన్ల అభివృద్ధిపై ఇప్పటికే సంబంధిత మంత్రులతో చర్చించినట్లు మంత్రి తెలిపారు.

గ్రామీణ, పట్టణ ప్రాంత ప్రజలకు పరిశుభ్రమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం జలజీవన్ మిషన్ ద్వారా మంజూరు చేసిన నిధులు గత ప్రభుత్వం వేరే కార్యక్రమాలకు మళ్లించడం వల్ల పథకం కార్యాచరణ లక్ష్యానికి విఘాతం కలిగిందన్నారు. రాష్ట్ర డిప్యూటీ సిఎం కొణిదెల పవన్ కళ్యాణ్ పిఠాపురం నియోజకవర్గంలో మూడు రోజులు పాటు పర్యటించనున్నట్లు మంత్రి తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక నాయకులు కొమ్మిన వెంకటేశ్వరరావు, బండి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు

ఆర్‌టిసి డిపోను అభివృద్ధి చేయాలి

ప్రజాశక్తి - నిడదవోలు

నిడదవోలు ఆర్‌టిసి డిపోను అభివృద్ధి చేయాలని, ఆర్‌టిసి సౌకర్యాల సాధన కమిటీ కన్వీనర్ జువ్వల రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం డిపో వద్ద మీడియాతో రాంబాబు మాట్లాడారు. ఏజెన్సీకి ముఖద్వారంగా, నియోజకవర్గం కేంద్రంగా ఉన్న అత్యంత లాభాలతో నడిచే డిపో అభివృద్ధి కొంతమంది అధికారుల అలసత్వం వల్ల కుంటు పడిందని రాంబాబు విమర్శించారు. ఫిట్‌నెస్ లేని బస్సులు నడుపుతూ ప్రయాణికులకు చాలా ఇబ్బందులు కలుగ చేస్తున్నారని రాంబాబు విమర్శించారు. మాజీ సిఎం వైఎస్.జగన్ నిడదవోలు పర్యటన సందర్భంగా డిపో అభివృద్ధికి రూ.6 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించి నిధులు మంజూరు చేయకుండా దగా చేశారన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం నిడదవోలు ఆర్‌టిసి డిపో అభివృద్ధిపై దృష్టి పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో కె.గోపి, జి.డేనియల్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ రికార్డులు కంప్యూటరైజ్ చేయాలి

ప్రజాశక్తి-చాగల్లు

ఉన్నగట్ల విశాల సహకార పరపతి సంఘం పరిధిలోని సభ్యులందరూ తమ రికార్డులను తప్పనిసరిగా కంప్యూటరైజేషన్ చేసుకోవాలని సొసైటీ కార్యదర్శి కేతనపల్లి శ్రీనివాసరావు తెలిపారు. చాగల్లు, నెలటూరు మీనా నగరం, ఉన్నగట్ల, ఎస్.ముప్పవరం, బ్రాహ్మణగూడెం గ్రామాలకు చెందిన సంఘ సభ్యులు అందరూ తమ రికార్డులను వెంటనే జులై 4వ తేదీ లోపు కంప్యూటరైజేషన్ చేసుకోవాలన్నారు. ఇందుకోసం ఆధార్ కార్డు జిరాక్స్, రెండు ఫోటోలతో సంప్రదించాలని కార్యదర్శి శ్రీనివాసరావు తెలిపారు.

కేక్ కటింగ్ చేయిస్తున్న ఎంఎల్‌ఎ బత్తుల బలరామకృష్ణ

ఘనంగా మణివీర్ పుట్టినరోజు వేడుక

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని పురుషోత్తపట్నంలో టిడిపి నాయకుడు మండ సత్యనారాయణ కుమారుడు మణివీర్ పుట్టిన రోజు వేడుకల్లో ఆదివారం ఎంఎల్‌ఎ బత్తుల బలరామకృష్ణ పాల్గొన్నారు. మణివీర్ తల్లిదండ్రులు మండ సత్యనారాయణ దంపతుల సమక్షంలో ఎంఎల్‌ఎ బలరామకృష్ణ కేక్ కటింగ్ చేయించారు. మణివీర్‌ను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గద్దే వెంకటకృష్ణ చౌదరి, మండ రాంబాబు, మండ వెంకటేశ్వరరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సింగవరంలో ఎంఎల్‌ఎ బత్తుల పర్యటన

రాజానగరం ఎంఎల్‌ఎ బత్తుల బలరామకృష్ణ సీతానగరం మండలం సింగవరంలో ఆదివారం పర్యటించారు. గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారి ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్న విషయాన్ని తెలుసుకుని ఆయన ఆ ప్రాంతంలో పర్యటించారు. స్థానిక ప్రజలు డ్రైనేజీ వ్యవస్థ దారుణంగా ఉండటం వల్ల అపారిశుధ్యం పెరిగిందని ఆయన వద్ద ఆందోళన వ్యక్తం చేశారు. తామంతా దీనివల్ల అంటువ్యాధులు బారిన పడుతున్నామన్నారు. దీనిపై ఎంఎల్‌ఎ స్పందించారు. వ్యాధుల బారిన పడిన వారిని ఎంఎల్‌ఎ పరామర్శించారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. దారుణ పరిస్థితులపై అధికారులను నిలదీశారు. అసలే వర్షాకాలం అంటువ్యాధులు ప్రబలే కాలం, ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే డ్రైనేజీ వ్యవస్థను బాగు చేయాలని, ప్రజలు సీజనల్ వ్యాధులు బారిన పడకుండా కాపాడాలని ఆదేశించారు. ప్రజారోగ్యం కాపాడడం ప్రజాప్రతినిధిగా తనతో పాటు అధికారులు బాధ్యత అన్న విషయాన్ని మర్చిపోవద్దన్నారు. ఆయన వెంట గ్రామ సర్పంచ్ సంగన చిన పోసియ్య, ఎంపిడిఒ హేమ సుందర్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ చైతన్య, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ చంద్రలీలకు పలువురి సంఘీభావం

ప్రజాశక్తి - సీతానగరం

రఘుదేవపురం సర్పంచ్ ఇండిగమెల్లి చంద్రలీలకు ఆదివారం పలువురు ఎంఆర్‌పిఎస్ నాయకులు కలిసి సంఘీభావం తెలిపారు. దళిత మహిళా సర్పంచ్‌పై అసత్య ఆరోపణలు చేస్తున్నారని సంఘం ఉత్తర కోస్తా ఆంధ్రా జిల్లాల అధ్యక్షుడు ముమ్మిడివరపు చినసుబ్బారావు మాదిగ తప్పు పట్టారు. ఆమెను కలిసి ధైర్యం చెప్పారు. సర్పంచ్ చంద్రలీలను కూటమి నాయకులు వేధింపులకు గురి చేస్తే అండగా నిలబడి పోరాటం చేయడానికి సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. గ్రామ పంచాయతీలో ఒక ప్రైవేటు ఉద్యోగి కుట్రలతో సర్పంచ్‌ను ఒత్తిడికి లోను చేస్తున్నారన్నారు. ఆమెకు మరో రెండేళ్ల పాటు సర్పంచ్‌గా ఉండే హక్కు ఉన్నా పదవి నుంచి తప్పుకోమనడం సరైంది కాదన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది చిడిపి నకుల సురేష్, గెద్దాడ త్రిమూర్తులు, డాన్ సూరి మాదిగ, కొత్తపల్లి గాంధీ, తోలేటి రామ్‌ప్రసాద్, కొమ్ముకూరి వీరబాబు, పోసుపో కుమార్, నాని పాల్గొన్నారు.

కానిస్టేబుల్ కృష్ణారావుకు ఘన సన్మానం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

సమర్థవంతంగా విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ చేస్తున్న కానిస్టేబుల్ కృష్ణారావు శేష జీవితం సుఖ సంతోషాలతో గడపాలని ఎస్ఐ వి.అప్పలరాజు ఆకాంక్షించారు. ఆదివారం కృష్ణారావు ఉద్యోగ విరమణ సందర్భంగా వారి దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ ఏర్పాట్లపై సమీక్ష

ప్రజాశక్తి-కొవ్వూరు రూరల్, చాగల్లు,

కొవ్వూరు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో 14,272 మందికి పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉందని జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్ భరత్ తెలిపారు. మండలంలోని తొగుమ్మి గ్రామ పంచాయతీ కార్యాలయంలో సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ్‌తో కలిసి ఆయన పెన్షన్ పంపిణీ చేసే సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. జెసి తేజ్ భరత్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు పింఛన్లు పంపిణీ ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు సన్నద్ధంగా ఉండాలని కోరారు. పెన్షన్ నగదు చెల్లింపులతో ముఖ్యమంత్రి లేఖను ప్రతి ఒక్కరికీ అందచేసి రసీదు తీసుకోవాల్సి ఉంటుందని ఆదేశించారు. కొవ్వూరు రూరల్ మండలంలో 10,257 మందికి రూ.6,82,32,000, కొవ్వూరు అర్బన్‌లో 4,015 మందికి రూ.2,78,51,000 పంపిణీకి సిద్ధం చేశామన్నారు. ఇందుకోసం కొవ్వూరు అర్బన్‌లో 83 మంది, రూరల్‌లో 160 మంది సిబ్బందిని నియమించామన్నారు. 233 మంది సచివాలయ సిబ్బంది, 10 మంది ఇతర శాఖల సిబ్బందిని నియమించి, మ్యాపింగ్ చేసినట్టు తెలిపారు. చాగల్లు మండలంలో జరుగుచున్న పెన్షన్ల పంపిణీ ఏర్పాట్లను జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్ భరత్, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవ్వాత్సవ్ ఆదివారం పరిశీలించారు. చాగల్లు-1, నెలటూరు గ్రామ సచివాలయాలను ఆయన సందర్శించారు. ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. సోమవారం ఉదయం 05.00 గంటల నుంచే పింఛన్లు పంపిణీ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ స్పెషల్ ఆఫీసర్ కె.చంద్ర శేఖర్, ఎంపిడిఒ ఎన్.బుజ్జి, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొవ్వూరు మండలం తోగుమ్మిలో సిబ్బందితో మాట్లాడుతున్న జెసి

ఎస్ఐ సత్యనారాయణ దంపతులకు సన్మానం

ప్రజాశక్తి- గోకవరం

సత్యనారాయణ దంపతులను సత్కరిస్తున్న సిబ్బంది

గోకవరం పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ సత్యనారాయణ ఉద్యోగ విరమణ సందర్భంగా ఆదివారం సత్యనారాయణ దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ నాగరాజు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గోకవరం పోలీస్ స్టేషన్‌కు ఎస్ఐ-2గా సత్యనారాయణ కృష్ణా జిల్లా నుంచి వచ్చారని తెలిపారు. వచ్చిన కొద్దిపాటి కాలంలో క్రమశిక్షణతో బాధ్యతగా పని చేశారని తెలిపారు. ఎస్ఐ సత్యనారాయణ బైపాస్ ఆపరేషన్ చేయించుకున్న కారణంగా మూడేళ్ల సర్వీసు ఉన్నప్పటికీ వాలంటరీ రిటైర్‌మెంట్ తీసుకున్నట్టు తెలిపారు.

ఇళ్ల వద్దే పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని 15 గ్రామాలకు సంబంధించి 19 సచివాలయాల్లో సామాజిక పింఛన్లను లబ్ధిదారుల ఇళ్ల వద్దే పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపిడిఒ తెలిపారు. నెలవారీ పెన్షన్ రూ.4 వేలు, ఏప్రిల్, మే, జూన్ నెలల వ్యత్యాసం సొమ్ము రూ.3 వేలతో కలిపి మొత్తం రూ.7 వేల నగదు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. సోమవారం ఉదయం 5 గంటల నుంచే పింఛన్లు పంపిణీ చేసేందుకు 149 మంది సచివాలయ, ప్రభుత్వ ఉద్యోగులు ప్రజా ప్రతినిధులు, నాయకుల సమక్షంలో పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు.

వ్యాధులపై అప్రమత్తత అవసరం

డిఎం హెచ్ఒ నరసింహ నాయక్

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

వర్షాకాలం నేపథ్యంలో వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డిఎం హెచ్ఒ డాక్టర్ జె.నరసింహ నాయక్ అన్నారు.

ఈ సీజన్‌లో ఏ వ్యాధులు వచ్చే అవకాశం ఉంది

వర్షాకాలంలో, మన రోగనిరోధక వ్యవస్థలు బలహీనపడతాయి. ఇది నీటి ద్వారా సంక్రమించే వ్యాధులు పెరగడానికి దారి తీస్తుంది. వర్షాకాలంలో అనేక వైరస్‌లు, బ్యాక్టీరియా, ఇతర వ్యాధులు వచ్చే ప్రమాదం ఇతర సీజన్‌లతో పోలిస్తే రెట్టింపు అవుతుంది. పెరిగిన గాలి తేమ, తేమ బూజు, శిలీంధ్రాలు, బ్యాక్టీరియా సహా సూక్ష్మజీవుల పెరుగుదలను ప్రోత్సహిస్తుంది. మలేరియా, డెంగీ, టైపాయిడ్, చికున్‌గున్యా, కామెర్లు, జలుబు, ఫ్లూ, లెప్టోస్పిరోసిస్ తదితర రోగాలు ఎక్కువగా వచ్చే అవకాశం ఉంటుంది.

జిల్లాలో ఇటీవల డయేరియా ఎక్కువగా వచ్చింది

తొండంగి, సామర్లకోట మండలాల్లో కొన్ని ప్రాంతాల్లో ఇటీవల పదుల సంఖ్యలో డయేరియా కేసులు నమోదయ్యాయి. వెంటనే వైద్య ఆరోగ్య సిబ్బంది అప్రమత్తం కావడంతో తీవ్రతను తగ్గించగలిగాము. ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి వ్యాధి వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకున్నాం. ప్రస్తుతం డయేరియా అదుపులోనే ఉంది.

డయేరియా కట్టడికి ఏ జాగ్రత్తలు తీసుకోవాలి

ఈ వ్యాధి ప్రబలే కాలంలో క్లోరిన్ కలిపిన నీటిని విధిగా తాగాలి. కాచి చల్లార్చిన నీటిని తాగినా మంచిదే. కుండ లేక బిందెల్లో చేతులు ముంచి నీటిని తాగకూడదు. కాడ గిన్నెతో వీటిని గ్లాసులో పోసుకుని తాగడాన్ని అలవాటు చేసుకోవాలి. కలుషితమైన నీరు తాగకూడదు. మంచినీటి పైపులైన్ల పగుళ్లను విధిగా మరమ్మతు చేయించుకోవాలి. మంచినీటిని విధిగా క్లోరినేషన్ చేయాలి. పరిసరాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత చాలా ముఖ్యం. చేతి పంపులు, కుళాయిల చుట్టూ పళ్ళెం ఆకారంలో ప్లాట్ ఫారాలను నిర్మించుకోవాలి.

ఆహార నియమాలేమి పాటించాలి

నిల్వ మాంసాహార పదార్థాలను అసలు తినకూడదు. ఆహార పదార్థాలపై మూతలు ఉంచాలి. భోజనానికి ముందు, మల విసర్జనకు తర్వాత చేతులను శుభ్రం చేసుకోవాలి. ఇంటి పరిసరాలతో పాటు బహిరంగ మల విసర్జన చేయకూడదు.తాగునీటి చెరువులో, మంచినీటి బావులు, బోర్ల వద్ద బట్టలు ఉతకడం, పశువులు కడగటం వంటివి చేయకూడదు. ఇంటి పరిసరాల్లో మురుగునీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి. సూక్ష్మక్రిములు చేరకుండా పరిసరాల్లో చెత్త కుప్ప, పేడ నిల్వ ఉంచరాదు. వ్యక్తిగత, పరిశుభ్రత చాలా ముఖ్యం. వంట చేసే ముందు, భోజనం వడ్డించేందుకు ముందు కూడా సబ్బుతో గోళ్లతో సహా చేతులు శుభ్రం చేసుకోవాలి.

అందరికీ వైద్యం అందాలి : డాక్టర్ ప్రశాంత్

మామిడికుదురు : అందరికీ వైద్యం అందాలని, దీని కోసం ప్రజలు, ప్రజాప్రతినిధులు పోరాడాలని నగరం పిహెచ్‌సి వైద్యాధికారి కెజె.ప్రశాంత్ అన్నారు. నేడు వైద్యరంగం ఖరీదైన వ్యాపారంగా మారిపోయిందన్నారు. పేదలు ప్రభుత్వ వైద్య సేవలు వినియోగించుకునేలా చైతన్య పరచాలన్నారు. ఆరోగ్య సంరక్షణకు ఎక్కువ నిధులు తీసుకొచ్చేలా కృషి చేయాలని సూచించారు. స్వచ్ఛంద సంస్థలు నిస్వార్థంగా పనిచేయాలన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి వెళ్లి వారి సమస్యలు పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉన్న అపోహలను విడనాడాలన్నారు.

మురుగు నీటి నిల్వలతో అనారోగ్యం

పెద్దపల్ల పిహెచ్‌సి వైద్యాధికారి భవాని శంకర్

ప్రజాశక్తి - ఆలమూరు

మురుగునీటి నిల్వల వల్ల దోమలు, ఈగలు వృద్ధి చెంది అనారోగ్యానికి కారణమవుతాయని పెదపల్ల వైద్యాధికారి పి.భవానిశంకర్ అన్నారు. వర్షాల నేపథ్యంలో చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంపట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నివాస సముదాయాలను, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఎవరైనా అనారోగ్యానికి గురైతే వెంటనే ఆసుపత్రిలో సంప్రదించి, వైద్య సేవలు పొందాలన్నారు. డయేరియాను తరిమికొట్టేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు.

పరిసరాల శుభ్రతతో వ్యాధుల నివారణ

పిహెచ్‌సి వైద్యాధికారి సువర్చల

ప్రజాశక్తి - ఆలమూరు

పరిసరాల శుభ్రతతో వ్యాధుల నివారణ సాధ్యమవుతుందని చొప్పెల్ల పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ సువర్చల అన్నారు. వర్షాకాలం నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. నిత్య జీవితంలో కొన్ని అశ్రద్ధ పనుల వల్ల రోగాల బారిన పడుతూ ఉంటామన్నారు. వాటిని గుర్తుంచుకొని దూరంగా ఉండాలన్నారు. ఎవరైనా అస్వస్థతకు గురైతే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

వేట్లపాలెం పిహెచ్‌సి వైద్యాధికారి హిమావతి

ప్రజాశక్తి - సామర్లకోట

వర్షాకాలం నేపథ్యంలో వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని వేట్లపాలెం పిహెచ్‌సి వైద్యాధికారి వై.హిమావతి అన్నారు. నీటి నిల్వల వల్ల దోమలు వృద్ధి చెందుతాయన్నారు. ఫలితంగా వ్యాధులు ప్రబలుతాయన్నారు. వర్షాకాలంలో జలుబు, విష జ్వరాలు, అతిసార ప్రబలుతాయన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగడం, వేడి ఆహారాన్ని తీసుకోవడం, పరిశరాలను శుభ్రంగా ఉంచుకోవడం చేయాలన్నారు. అనారోగ్యానికి గురైతే వైద్యులను సంప్రదించాలన్నారు.





డాక్టర్స్ డే ప్రత్యేకం

రోగాన్ని నయం చేసేవి ఔషధాలు..
కాని రోగిని నయం చేసేది వైద్యుడు మాత్రమే
- కార్ల్ గుస్తావ్ జంగ్

రోగులు ఎంత రుసుం చెల్లించినా... వైద్యుల రుణం తీర్చుకోలేరు...
- ప్రఖ్యాత తత్వవేత్త సెనెకా

ఆరోగ్యశ్రీతో కార్పొరేట్ వైద్యం

జిల్లా ఆరోగ్యశ్రీ అధికారి ప్రియాంక

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం

ఆరోగ్యశ్రీ పథకం ద్వారా పేదలకు కార్పొరేట్ వైద్యం అందిస్తున్నామని ఆరోగ్యశ్రీ జిల్లా కో- ఆర్డినేటర్ డాక్టర్ పి.ప్రియాంక అన్నారు. ప్రజాశక్తితో ఆమె మాట్లాడుతూ... ఆరోగ్యశ్రీ నెట్ వర్క్ ఆసుపత్రుల నుంచి ఎటువంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఏ ఒక్క లబ్ధిదారునికీ అన్యాయం జరగకుండా వైద్యం అందేలా చూస్తానన్నారు. ఎప్పటికప్పుడు తమ సేవలు మెరుగుపరుచుకునేందుకు ఆరోగ్యశ్రీ టీమ్, ఆరోగ్య మిత్రల సమన్వయంతో పనిచేస్తున్నామన్నారు. చిన్న నాటి నుంచి డాక్టర్ కావాలనేది తన కోరికన్నారు. దానికోసం కష్టపడి చదివానన్నారు. హౌస్ సర్జన్‌గా చేరి ఎమర్జెన్సీ స్కిల్స్ నేర్చుకొని అనంతరం రూరల్ ప్రాంతాల్లో డాక్టర్‌గా సేవలందించానని తెలిపారు. ప్రస్తుతం ఆరోగ్యశ్రీ కో-ఆర్డినేటర్‌గా సేవలందించడం ఆనందంగా ఉందన్నారు.

ఆయుర్వేదంతో ఆరోగ్యం సురక్షితం

అచ్చంపేట ఆయుర్వేద ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ షాజద్ అలీ



ప్రజాశక్తి - సామర్లకోట

ఆయుర్వేదంతో సురక్షితమైన ఆరోగ్యాన్ని పొందొచ్చని అంటున్నారు అచ్చంపేట ఆయుర్వేద ఆసుపత్రి ప్రభుత్వ వైద్యులు డాక్టర్ ఎం.షాజద్అలీ. డాక్టర్స్ డే పురస్కరించుకుని ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. ఆయుర్వేదంలో ప్రకృతిలో ఉన్న జంతువులు, మొక్కలు, ఖనిజాలు నుంచి వచ్చే ఔషధాలను ఉపయోగిస్తారన్నారు. వాత, పిత్త, కఫ అనే మూడు దశల్లో ఆయుర్వేద వైద్యం చేస్తారన్నారు. ఆరోగ్యాన్ని కాపాడడానికి, రోగం రాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడానికి ఆయుర్వేదం ఉపయుక్తంగా ఉంటుందన్నారు. తమ ఆసుపత్రికి నిత్యం సామర్లకోట, కాకినాడ పరిసర ప్రాంతాలకు చెందిన సుమారు 70 మంది వరకూ వస్తుంటారన్నారు. ఆసుపత్రి ఆవరణలో ఆయుర్వేద వైద్యానికి వినియోగించే పలు రకాల మొక్కలను పెంచుతూ వాటిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.

కడియం ఆసుపత్రిలో మెరుగైన సేవలు

సిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ ఎం.శివశంకర్

ప్రజాశక్తి- కడియం

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, కడియం సిహెచ్‌సిలో మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నామని మెడికల్ ఆఫీసర్ ఎం.శివశంకర్ అన్నారు. డాక్టర్స్ డే సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. సాధారణంగా వర్షాకాలంలో నీటి నిల్వల వల్ల దోమలు, ఈగలు వృద్ధి చెందుతాయన్నారు. కలుషితమైన నీరు, ఆహారం తీసుకోవడం వల్ల డయేరియా వంటి వ్యాధులు వ్యాప్తి చెందుతాయి. వీటి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. తమ ఆసుపత్రిలో చిన్నపిల్లల చికిత్సతో పాటు షుగర్ పేషెంట్లకు, క్రిటికల్ పేషెంట్లకు, కిడ్నీలో రాళ్లు ఉన్న వారికి చికిత్స అందిస్తున్నామన్నారు. గైనిక్ విభాగంలో సాధారణ కాన్పులకే ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. గుండెపోటు వచ్చిన వారికి రూ.48వేల విలువ చేసే ఇంజక్షన్ అందుబాటులో ఉందన్నారు. ఎటువంటి ఎమర్జెన్సీ వైద్యమైనా అందించేందుకు డాక్టర్లందరూ అందుబాటులో ఉంటారన్నారు. డిసిహెచ్ఎస్ డాక్టర్ పద్మశ్రీ రాణి సహకారంతో ఆసుపత్రిలో మెరుగైన సేవలు అందిస్తున్నామన్నారు.

వైద్యంలో ఆదర్శప్రాయుడు సూరిబాబు

మూడు పర్యాయాలు పిఎంపి అధ్యక్షులుగా సేవలు

ప్రజాశక్తి- యు.కొత్తపల్లి

తీర ప్రాంత గ్రామాల్లో ప్రజల వైద్య అవసరాలను తీరుస్తూ ఆదర్శంగా నిలిచారు పిఎంపి వైద్యులు మామిడి సూరిబాబు. మూడు పర్యాయాలు పిఎంపి మండల అధ్యక్షులుగా సేవలు అందించారు. 1995 నుంచి నేటి వరకు పేదలకు సొమ్ముతో సంబంధం లేకుండా వైద్యం అందిస్తున్నానిని మామిడి సూరిబాబు తెలిపారు. 29 ఏళ్ల పాటు వైద్య సేవలో ఎన్నో ఆటుపోట్లు చవి చూశానిని తెలిపారు. గతంలో ఉప్పాడ గ్రామంలో డయేరియా, మలేరియా, వైరల్ జ్వరాలు ప్రబలినప్పుడు రోగులకు వైద్యం అందించానన్నారు. రోగుల పరిస్థితిని బట్టి మెరుగైన వైద్యం అందించాలంటే దగ్గరుండి కాకినాడకు తీసుకెళ్లేవాడినని తెలిపారు. అప్పటి నుంచి ఇదే వృత్తిని నమ్ముకూడా తీర ప్రాంత గ్రామాల్లో వైద్యసేవలందించాలనే దృక్పథంతో ముందుకు సాగుతున్నానని తెలిపారు. సాయి రామ్ క్లినిక్ పేరుతో 24 గంటలు వైద్యం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మెరుగైన వైద్యం కోసం వారంలో రెండు రోజులు కాకినాడ నుండి ప్రత్యేక వైద్యులను తీసుకొస్తున్నామన్నారు. అలాగే సింధు మెడికల్ స్టోర్ అండ్ జనరల్ స్టోర్ నిర్వహిస్తూ పేదలకు అతి తక్కువ ధరలకే మందులను అందిస్తున్నానన్నారు. హైదరాబాద్ నిమ్స్, విశాఖ కెజిహెచ్, సెవెన్ హిల్స్ ఆసుపత్రులకు రోగుల్ని తీసుకువెళ్లి అతి తక్కువ సొమ్ములతో దగ్గర ఉండి వైద్య సేవలు అందించానన్నారు.

డాక్టర్స్ డే శుభాకాంక్షలతో...
నిత్యం ప్రజలకు వైద్య ద్వారా సేవలందిస్తున్న వైద్యులకు, వైద్య సిబ్బందికి డాక్టర్స్ డే శుభాకాంక్షలు...
ప్రాథమిక ఆరోగ్య కేంద్రం
గొల్లపాలెం, కాజులూరు మండలం, కాకినాడ జిల్లా
డా॥ సౌజన్య మెడికల్ ఆఫీసర్ - PHC గొల్లపాలెం
డా॥ శ్రేయా మెడికల్ ఆఫీసర్ - PHC గొల్లపాలెం
మరియు సిబ్బంది

ఆదర్శ యూరాలజీ సూపర్ స్పెషాలటీ మెటర్నిటీ నర్సింగ్ హోమ్
ఆదర్శ హాస్పిటల్
వడ్డిగూడెం, అమలాపురం
డాక్టర్స్ డే శుభాకాంక్షలతో...
ఆరోగ్యంతో జీవించేందుకు ఎల్లవేళలా వైద్య వృత్తిలో అమూల్యమైన సేవలు అందిస్తూ.., ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించడానికి అహర్నిశలు శ్రమిస్తున్న వైద్యులందరికీ డాక్టర్స్ డే శుభాకాంక్షలు...
24/7 SERVICE
Contact 08856-234868 73825 33644
డా॥ వి.ఎల్.ఎన్. దీక్షితుల శ్రీనివాసులు M.S., MCH.,(Urology) మూత్రకోస మరియు జననావయవ శస్త్ర చికిత్స నిపుణులు
డా॥ వి.గిరిజా కుమారి M.B.B.S., G.D.O. ప్రసూతి మరియు స్త్రీ వ్యాధి నిపుణురాలు

డాక్టర్స్ డే శుభాకాంక్షలతో...
ప్రాథమిక ఆరోగ్య కేంద్రం
నగరం-మామిడికుదురు మండలం
డా॥ కె.జె.ప్రశాంత్ వైద్యులు
డా॥ కె.స్వర్ణ లత వైద్యాధికారిణి
జీవితంపై ఆశలు వదులుకున్న వారి ఆరోగ్యాన్ని పున:రుద్ధరించేందుకు నిరంతరం శ్రమించే వైద్యులందరికీ డాక్టర్స్ డే శుభాకాంక్షలు
నగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది

డాక్టర్స్ డే శుభాకాంక్షలతో...
రోహిణి తల్లీ పిల్లల ఆసుపత్రి
ROHINI MOTHER & CHILD HOSPITAL
TOTAL CARE FOR WOMEN AND CHILDREN UNDER ONE ROOF
చందన బ్రదర్స్ దగ్గర, రోహిణి హాస్పటల్ స్ట్రీట్, అమలాపురం
Dr. V.S.S.N.MURTHY M.D. (Anae, PGI Chandigarh), D.Ch. Ex. Registrar, PGI Chandigarh Ex. Registrar, NIMS, Hyderabad Cell: 95507 37300
Dr. V.SARADA M.B.B.S, D.G.O., D.M.R.D., Obstetrician, Gynaecologist, Radiologist & Infertility Specialist Cell: 9010771644
సంతానము లేని పిల్లల కొరకు సంబంధించిన పరీక్షలు చేసే కేంద్రం అప్పుడే పుట్టిన బరువు తక్కువగా పుట్టిన పిల్లల వైద్యం, చిన్నపిల్లలకు సంబంధించిన అత్యవసర వైద్య విభాగము

శ్రీరామ్ హాస్పిటల్
కళా వెంకట్రావు స్ట్రీట్, భీకన్న హోటల్ దగ్గర, ఎస్.కె.బి.ఆర్.కాలేజ్ రోడ్డు, అమలాపురం, ఫోన్: 08856-231239, సెల్: 9912111239
డా॥ కొల్లు సునీత M.B.B.S., DA ఎనస్తీషియాలసిస్ట్, జనరల్ వైద్య నిపుణులు
ఎండోస్కోపి, ల్యాప్రోస్కోపిక్ సర్జరీ చేయబడును
డా॥ కొల్లు శ్రీనుబాబు M.S.FIAGES జనరల్, ల్యాప్రోస్కోపిక్ సర్జన్
లేజర్ ద్వారా నొప్పి లేకుండా పైల్స్, ఫిస్టుల, ఫిషర్ వెరికోస్ వెయిన్స్ (EVLT) చేయబడును.
మావద్ద లభించు వైద్యసేవలు : అన్నిరకముల జనరల్ సర్జరీలు, ఎండోస్కోపి పరీక్షలు, అత్యాధునిక ల్యాప్రోస్కోపిక్ సర్జరీలు, క్యాన్సర్ సర్జరీలు, ప్లాస్టిక్ సర్జరీలు, లివర్, షుగరు సంబంధిత వ్యాధులకు, లేజర్ సర్జరీలు, అన్నిరకముల ఎమర్జన్సీ ఆపరేషన్స్ చేయబడును.

డాక్టర్స్ డే శుభాకాంక్షలతో...
తోటి డాక్టర్లకు మిత్రులకు, శ్రేయోభిలాషులకు అందరికీ డాక్టర్స్ డే శుభాకాంక్షలు...
భాస్కరరాజు హాస్పటల్
Women and Child Care
ప్రకాష్‌నగర్, రాజమండ్రి. ఫోన్: 0883-2467423
డా॥ దాట్ల సతీష్ M.D (Paediatrics), D.M (Neonatology)
డా॥ దాట్ల దివ్య M.S (OBGY), FMAS, DMAS, Obestetrics & Gynaecologist, Laparoscopic Surgeon

డాక్టర్స్ డే శుభాకాంక్షలతో...
ప్రజాశ్రేయస్సు కొరకు రేయింబవళ్లు శ్రమిస్తున్న వైద్యాధికారులకు, వైద్య సిబ్బందికి డాక్టర్స్ డే శుభాకంక్షలు...
ప్రాథమిక ఆరోగ్య కేంద్రం
దుగ్గుదుర్రు, కాజులూరు మండలం, కాకినాడ జిల్లా
డా॥ వై. సుప్రియ మెడికల్ ఆఫీసర్ PHC దుగ్గుదుర్రు
డా॥ జి. స్వాతి మెడికల్ ఆఫీసర్ PHC దుగ్గుదుర్రు

డాక్టర్స్ డే శుభాకాంక్షలతో...
రామకృష్ణారెడ్డి నర్సింగ్ హోమ్
గొల్లలమామిడాడ, పెదపూడి మండలం, కాకినాడ జిల్లా
మా గురువులు, కనిపించని ఆ దేవుడు ఊపిరి పోస్తాడు... కనిపించే ఈ దేవుళ్ళు మనకు పునర్జన్మ ప్రసాదిస్తారు.. వైద్యులే అసలైన దేవుళ్ళు... హ్యాపీ డాక్టర్స్ డే శుభాకాంక్షలు...
Dr. K.TAMMI REDDY M.B.B.S.
Dr. K.V.NARASIMHA REDDY M.S. (Gen Surgeon)
Dr. K.LAXMI TULASI M.B.B.S., D.A.
మీ... పి.వి.వి.సత్యనారాయణ (పండు), ప్రజాశక్తి విలేకరి

డాక్టర్స్ డే శుభాకాంక్షలు
వైద్యం అంటే ఓ వృత్తిగా కాకుండా మనుషుల్ని బ్రతికించే ఓ మహాశక్తిగా ప్రజలకు సేవ చేస్తున్న వైద్యులకు, వైద్య సిబ్బందికి ఇవే మా డాక్టర్స్ డే శుభాకాక్షలు...
ప్రజాశక్తి శ్రేయోభిలాషి
పిఠాపురం, కాకినాడ జిల్లా

డాక్టర్స్ డే శుభాకాంక్షలతో...
ప్రజా శ్రేయస్సు కొరకు రేయింబవళ్ళు శ్రమిస్తున్న డాక్టర్లకు, వైద్య సిబ్బందికి డాక్టర్స్ డే శుభాకాంక్షలు...
సూర్య డయాగ్నోస్టిక్స్
ఎస్‌కెబిఆర్ కాలేజి రోడ్, అమలాపురం, ఫోన్: 99488 40967
గల్ఫ్ మెడికల్ చేయబడును
కె.వి.ఎన్.రాజు, D.M.L.T.,
శ్రీ సాయి శ్రీదేవి డయాగ్నోస్టిక్స్ & స్పెషాలిటీ ల్యాబ్
జి.వి.మాల్ ఎదురుగా, సిటీకేబుల్ రోడ్, అమలాపురం
ఫోన్: 96667 37919, 9640900569
అన్నిరకముల రక్త పరీక్షలు చేయబడును గల్ఫ్ మెడికల్ చేయబడును
దొంగ రవి కిరణ్ D.M.L.T.,
◆ డా॥ డి.వి.సత్యం, మెడికల్ ఆఫీసర్
◆ డా॥ వై.రాహుల్ ఆడమ్స్, మెడికల్ ఆఫీసర్
◆ డా॥ బి.వెంకటేష్, మెడికల్ ఆఫీసర్
మరియు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది
ప్రాథమిక ఆరోగ్య కేంద్రం
పేరూరు, అమలాపురం మండలం

KCDA
THE KOVVUR CHEMISTS & DRUGGISTS ASSOCIATION
Regd. No. 66 of 2003
వైద్యం అంటే ఓ వృత్తిగా కాకుండా మనుషుల్ని బ్రతికించే ఓ మహాశక్తిగా ప్రజలకు సేవ చేస్తున్న వైద్యులకు, వైద్య సిబ్బందికి ఇవే మా డాక్టర్స్ డే శుభాకాక్షలు...
President MADDULA SOMARAJU (Nani)
Secretary KOTLA VEERA RAGHAVULU
Treasurer MANEPALLI RAMESH

డాక్టర్స్ డే శుభాకాంక్షలతో...
వైద్యం అంటే ఓ వృత్తిగా కాకుండా మూగజీవాలను బ్రతికించే ఓ మహాశక్తిగా సేవ చేస్తున్న వైద్యులకు, వైద్య సిబ్బందికి ఇవే మా డాక్టర్స్ డే శుభాకాక్షలు...
పశుసంవర్ధక శాఖ
ప్రాంతీయ పశు వైద్యశాల
నల్లజర్ల, కొవ్వూరు డివిజన్, తూ॥గో॥జిల్లా
గాజులవర్తి మోజెస్ వెస్లి
సహాయ సంచాలకులు

డాక్టర్స్ డే శుభాకాంక్షలతో... ☎ 0884-2340315(C), 2341115(R)
కరుణ హాస్పిటల్
ప్రజా శ్రేయస్సు కొరకు రేయింబవళ్ళు శ్రమిస్తున్న డాక్టర్లకు డాక్టర్స్ డే శుభాకాంక్షలు
సీనియర్ ఫ్యామిలీ ఫిజీషియన్ మరియు షుగరు వ్యాధి స్పెషలిస్ట్ (రిటైర్డ్, డిప్యూటీ సివిల్ సర్జన్)
24/7 Emergency Services
డా॥ వి.వెంకటరావు M.B.B.S., (M.D) F.C.G.P., F.C. in Daibetology
సంప్రదించు వేళలు: ఉ॥ 9 గం॥ల నుండి మ॥ 1 గం॥ వరకు మరియు సా॥ 6 గం॥ల నుండి 9 గం॥ల వరకు

డాక్టర్స్ డే శుభాకాంక్షలతో...
నిత్యం ప్రజల కొరకు, ప్రజాశ్రేయస్సు కోరుతూ, రేయింబవళ్ళు శ్రమిస్తున్న జిల్లా ఉన్నతాధికారులకు, మండల వైద్య అధికారులకు, ఇవే మా డాక్టర్స్ డే శుభాకాంక్షలు
Dr. M.RAJASEKHAR MBBS
Dr. G.BABU SHIVA CHAITANYA Katravulapalem
KATRAVULAPALLI PHC
Jaggampeta Mandalam, Kakinada Dist.,

డాక్టర్స్ డే శుభాకాంక్షలతో...
అంకితభావంతో ప్రజలకు వైద్య సేవలు అందిస్తూ... ప్రజల ఆరోగ్య పరిరక్షణకు కృషి చేస్తున్న వైద్యులందరికీ డాక్టర్స్ డే శుభాకాంక్షలు...
Dr. M.Shahzad Ali, Medical Officer
Government Ayurvedic Dispensary
Atchampeta, Samalkota Mandalam, Kakinada Dist.,

డాక్టర్స్ డే శుభాకాంక్షలతో...
వైద్యం అంటే ఓ వృత్తిగా కాకుండా మనుషుల్ని బ్రతికించే ఓ మహాశక్తిగా ప్రజలకు సేవ చేస్తున్న వైద్యులకు, వైద్య సిబ్బందికి ఇవే మా డాక్టర్స్ డే శుభాకాక్షలు...
డా॥ సిరాజ్ ఉద్దీన్ పి.హెచ్.సి., నల్లజర్ల
ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నల్లజర్ల మండలం
డా॥ టి.గంగాధరరావు పి.హెచ్.సి., నల్లజర్ల

డాక్టర్స్ డే శుభాకాంక్షలతో...
శ్రీ సాయిరామ్ క్లినిక్
ఉప్పాడ బీచ్ రోడ్డు, వాటర్ ట్యాంక్ ప్రక్కన
ఇనోదయ వైద్యులు గైనకాలజిస్టు డా॥ సత్య సౌజన్య, యురాలజిస్టు డా॥ వరప్రసాద్ ప్రతి మంగళవారం ఉప్పాడలో శ్రీ సాయిరామ్ క్లినిక్‌లో వైద్య పరీక్షలు నిర్వహించుచున్నారు.
ఎం.సూరిబాబు యు.కొత్తపల్లి
గత 30 సం॥ల నుండి తీరప్రాంతమైన ఉప్పాడ ప్రజలకు నిరంతరం వైద్య సేవలు అందిస్తూ... ముందుకు వెళ్తూ... పిల్లలకు ప్రత్యేక వైద్యులతో వారంలో మూడు రోజులపాటు డా॥ ఎస్.శేఖర్‌రెడ్డి గారితో ప్రత్యేక వైద్యం అందించబడుతుంది.
శ్రీ సాయిరామ్ క్లినిక్ జి.కె.ఎం. వారి కాంప్లెక్స్‌లో మరో బ్రాంచ్‌ను ప్రారంభించడం జరిగింది. 30వ సం॥రంలో అడుగుపెడుతున్న సందర్భంగా శ్రీ సాయిరామ్ క్లినిక్ పేరుతోనే మరో బ్రాంచ్ ఏర్పాటు చేయడం జరిగింది. ఉప్పాడ ప్రజలతో పాటు మిగిలిన గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోగలరు. అనుభవం గల వైద్యులు 24 గం॥లు అందుబాటులో ఉంటారు.

SUDHEER HOSPITAL ENT & GENERAL
సుధీర్ హాస్పటల్
ENT (చెవి, ముక్కు, గొంతు) & జనరల్ హాస్పటల్
చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు ప్రక్కన, కాలేజ్ రోడ్, అమలాపురం, సెల్: 8331807689, 8331807689
మావద్ద లభించు వైద్య సేవలు:
◆ ఇ.ఎన్.టి., ◆ ఐ.జి.యు / క్రిటికల్ కేర్ ◆ జనరల్ మెడిసిన్ ◆ ఎమర్జన్సీ ◆ జనరల్ సర్జరి ◆ అనస్తీషియా ◆ ప్రసూతి వైద్యం మరియు గైనకాలజీ ◆ పెయిన్ మేనేజ్‌మెంట్
డా॥ Y.సుధీర్‌కుమార్ M.D., Anesthesia, PDCC, FDM, FCCS మత్తు వైద్య నిపుణులు, డయాబెటాలజి స్పెషలిస్ట్, ఐసియు & ఇన్‌టెన్సివిస్ట్
అన్నిరకముల ఎమర్జెన్సీ కేసులు తీసుకోబడును.
డా॥ K.అనూష, M.S. ENT Ex. Senior Resident Kakinada Govt. Hospital చెవి, ముక్కు, గొంతు మరియు థైరాయిడ్ వ్యాధి నిపుణులు హెడ్ అండ్ నెక్ సర్జన్, అలెర్జీ స్పెషలిస్ట్
సంప్రదించు వేళలు: ఉ॥ 11 గం॥ల నుండి మ॥ 2 గం॥ వరకు, సాయంత్రం 4 గం॥ నుండి రాత్రి 8 గం॥ వరకు
సంప్రదించు వేళలు: సా॥ 6 గం॥ నుండి రాత్రి 8 గం॥ వరకు

డాక్టర్స్ డే శుభాకాంక్షలతో...
నిత్యం ప్రజల కొరకు, ప్రజాశ్రేయస్సు కోరుతూ, రేయింబవళ్ళు శ్రమిస్తున్న జిల్లా ఉన్నతాధికారులకు, మండల వైద్య అధికారులకు, ఇవే మా డాక్టర్స్ డే శుభాకాంక్షలు
Dr. T.PRANEDH M.S., General Surgeon
Dr. P.VINUSHA M.D.,
Dr. V.SRAVANA SANDHYA M.B.B.S.,
Dr. R.MADHURI M.B.B.S.,
Dr. K.BHAGYALAKSHMI D.G.O.,
Dr. S.SANKAR RAO Dental Surgeon
Dr. M.TEJA M.B.B.S.,
JAGGAMPETA CHC
Kakinada Dist.,